ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

శుక్రవారం 21 ఆగస్టు 2026 | Friday 21 August 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00

సంపుటి: 28 సంచిక: 132 | Vol.No 28 Issue No .132

PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

www.visionandhra.in


విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్: 9440897445, 8074636674

## రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

- వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం
- ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోడీ



న్యూఢిల్లీ,ఆగస్ట్20 : భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా

మిగతా 2లో..

### 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

## ప్రజలకు పూర్తి భరోసా

- కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు అధికారుల పర్యవేక్షణ
- ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు
- 22ఏ సమస్యను ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని పనిచేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా




మిగతా 2లో..

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

- అందుకు తనను బాధ్యులు చేయడం తగదు
- క్రమశిక్షణ లేఖను ఉపసంహరించుకోవాలన్న కొండా సురేఖ



హైదరాబాద్,ఆగస్ట్20 :తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన

మిగతా 2లో..




## సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

- దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయూత
- పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మహాబలిపురం,ఆగస్ట్20 : కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో

మిగతా 2లో..

## వర్షపాత లోటుతో రైతులకు ఉత్తమ్ హెచ్చరిక

- అంచనా వేసినట్లుగా సెప్టెంబర్ -అక్టోబర్ నెలల్లో వర్షాలు బలహీనంగా కురిస్తే, వర్షపాత లోటు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అన్నారు
- పంటల ప్రణాళికలో జాగ్రత్త వహించాలని, తాగునీరు, సాగునీటి అవసరాలను సమతుల్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- దొండపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 53,000 ఎకరాలకు సాగునీరు




వర్షపాత లోటు కొనసాగుతున్నందున, పంటల ప్రణాళిక విషయంలో రైతులు జాగ్రత్త వహించాలని సాగునీటి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనా వేసినట్లుగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉంటే పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. సాగునీటి అధికారులతో కలిసి మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, సూర్యాపేట జిల్లాలో సాగునీటి పనులను, ప్రస్తుత నీటి పరిస్థితిని సమీక్షించారు. సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకునే ముందు రాష్ట్ర ప్రభుత్వం వర్షపాతం, జలాశయాల మట్టాలు, నీటి ప్రవాహాన్ని నిశితంగా పర్యవేక్షిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కొనసాగుతున్న వర్షపాత లోటు నాగార్జున సాగర్‌తో సహా ప్రధాన జలాశయాల్లోకి నీటి ప్రవాహాన్ని ప్రభావితం చేసిందని, అందువల్ల అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడటం అత్యవసరం అని ఆయన అన్నారు. మిగిలిన రుతుపవన కాలానికి సంబంధించిన

మిగతా 2లో..

## ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు కఠినం

- కల్తీ ఆహార పదార్థాల తయారీదారులపై ఉక్కుపాదం
- మెడిపల్లిలో కల్తీ మసాలాల తయారీ కేంద్రంపై పోలీసుల మెరుపుదాడి
- కారం పొడిలో 30 శాతం రంపపు పొడి కలిపినట్లు గుర్తింపు
- 10.89 టన్నుల మసాలా పదార్థాలు స్వాధీనం విలువ రూ.25 లక్షలు
- ఇద్దరు అదుపులో నకిలీ ప్యాకింగ్, లేబుళ్ల గుట్టురట్టు
- వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి
- పోలీస్ కమిషనర్ బి. సుమతి



హైదరాబాద్,ఆగస్ట్20 :ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, ఆహార పదార్థాలను కల్తీ చేసి అక్రమ లాభాలకు పాల్పడే వారిపై చర్యలు అత్యంత కఠినంగా ఉంటాయని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి హెచ్చరించారు. ఆహారం మనిషి జీవనాధారమని, అలాంటి ఆహారంలోనే కల్తీ చేసి ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ

మిగతా 2లో..

## తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

### రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ




హైదరాబాద్,ఆగస్ట్20 : తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం

మిగతా 2లో..

### అరణ్యానికి సాంకేతిక

## రక్షణ కవచం

- అడవిలో ప్రతి కదలికపై నిఘాకు అత్యాధునిక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్
- కర్ణాటక నమూనా అటవీ పరిరక్షణపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి
- ప్రతి అంగుళం అడవిని పరిరక్షించేందుకు ఆధునిక సాంకేతిక వ్యవస్థ
- ఈ-గస్తు తరహా మొబైల్ యాప్‌తో వ్యవస్థలో జవాబుదారీతనం



అమరావతి, ఆగస్టు 20 : కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న తరహా అత్యాధునిక సాంకేతిక పరిపాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి అంగుళం అటవీ భూమిని సంరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న అరణ్యారామంలో కర్ణాటక తరహా అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ ద్వారా అడవుల మ్యాపింగ్‌తోపాటు పూర్తి స్థాయిలో వన్యప్రాణుల కదలికలు,

మిగతా 2లో..

## వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలకం

- ఆర్థిక శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉంది
- దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం ముఖ్యం
- సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు




చెన్నై,ఆగస్ట్20 : వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది ప్రాంతం కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. కేంద్ర – రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ఏపీ సీఎం సూచించారు. గురువారం తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారమే లక్ష్యమని తెలిపారు. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందని ఆయన గుర్తు చేశారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9,10 సంస్థలు.. 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదన్నారు. విభజన సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో సాకారం అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడును

మిగతా 2లో..

## తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ఎ జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30? కమిషన్ డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. 22ఎపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.

## రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఏటా సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

## 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

### ప్రజలకు పూర్తి భరోసా

అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, గడచిన రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 22ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. "రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి" అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణ నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణ కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మిత పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మిత పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.

## వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలకం

అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఆయన ప్రతిపాదించారు. కుప్పం మీదుగా బు+-లలెట్ ట్రైన్ నడపాలని పేర్కొన్నారు. రాజధాని అమరావతి - బెంగళూరు - చెన్నై నగరాలను అనుసంధానించేలా ఈ రవాణా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు. అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సీఎం చంద్రబాబు వివరించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చాలని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని తెలిపారు. విపత్తుల సమయంలో రాష్ట్రాల పరస్పరం సహకరించుకునేలా మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్ ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. రాజధాని అమరావతికి చట్టబద్ద రాజధాని హోదా సాధించామని ఈ సందర్భంగా ఏపీ సీఎం గుర్తు చేశారు. వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలని కేంద్రాన్ని ఆయన కోరారు. దుగ్గరాజపట్నం పోర్టు, రీ+నైరీ ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే కడప జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లింక్‌కు కూడా కేంద్ర అనుమతులు మంజూరు చేయాలన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకుపైగా నీటిని మళ్లించే ప్రతిపాదన ఉందన్నారు. గోదావరి - కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గంగా - కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక ఆవశ్యకతను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కోరారు. సహకారం, సమన్వయంతోనే దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల సీఎంలు కొనియాడారు. దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారని ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ముఖ్యమంత్రులు పేర్కొన్నారు. సీనియర్ నాయకుడిగా విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారంటూ సీఎం చంద్రబాబును కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసించారు.

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దుల ను ప్రభుత్వ ÷ళ్లె కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్?ఎఎ పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన పక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్ లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?చీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధ్రప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేదని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన పక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా?లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం వంటి అంశాలు రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని ఆకాంక్షించారు. ట్రిబ్యునల్ లేకుండా, కమిటీ లేకుండా, బహుశా మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేకుండా సమస్యలు పరిష్కారం కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరయ్యే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు కఠినం

ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, సరఫరాపై నిరంతర నిఘా కొనసాగుతుందని, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి అక్రమంగా సంపాదించాలనుకునే వారిపై చట్టం ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ బి. సుమతి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎస్ఓటీ మల్కాజిగిరి, ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ బృందాలు గురువారం మెడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉన్న సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌పై మెరుపుదాడి నిర్వహించాయి. విశ్వసనీయ సమాచారంతో చేపట్టిన ఈ తనిఖీల్లో పసుపు పొడి, కారం పొడి, ధనియాల పొడి, గరం మసాలాలను నిర్ణీత ఆహార నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించకుండా అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్నట్లు గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. వంటింట్లో రుచికి, ఆరోగ్యానికి ఆధారంగా ఉపయోగించే మసాలా దినుసులనే కల్తీ వ్యాపారానికి సాధనంగా మార్చిన తీరు తనిఖీల్లో వెలుగుచూసింది. ముఖ్యంగా కారం పొడిలో 30 శాతం రంపపు పొడి (సా డస్ట్) కలిపినట్లు గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు. అంతేకాకుండా అసలు బ్రాండ్‌ను పోలిన నకిలీ ప్యాకింగ్, లేబుళ్లను ఉపయోగించి వినియోగదారులకు నాణ్యమైన బ్రాండెడ్ ఉత్పత్తులుగా నమ్మించే ప్రయత్నం జరిగినట్లు గుర్తించారు. నాసిరకం ఆహార పదార్థాలకు ఆకర్షణీయమైన ప్యాకింగ్ ముసుగు తొడిగి మార్కెట్‌లోకి పంపుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ, వినియోగదారుడి నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని కల్తీ ఆహార పదార్థాలను మార్కెట్‌లోకి పంపడం తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ప్యాకెట్ అందంగా ఉందనో, దానిపై ప్రముఖ బ్రాండ్‌ను పోలిన పేరు ఉందనో ప్రజలు సహజంగా నమ్ముతారని, ఆ నమ్మకాన్నే అక్రమార్కులు తమ లాభాల కోసం వాడుకోవడం ప్రజారోగ్యానికి పెను ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. ఇటువంటి అక్రమ వ్యాపారాలపై సమాచారం సేకరించి, వాటి మూలాలను గుర్తించి, బాధ్యులపై వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దాడిలో భారీ మొత్తంలో మసాలా పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2,300 కిలోల పసుపు పొడి, 3,350 కిలోల కారం పొడి, 5,140 కిలోల ధనియాల పొడి, 100 కిలోల గరం మసాలాను సీజ్ చేశారు. మొత్తంగా 10,890 కిలోలు, అంటే 10.89 టన్నుల మసాలా పదార్థాలను స్వాధీనం






చేసుకోగా, వాటి అంచనా విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. తయారీ, ప్యాకింగ్‌కు ఉపయోగిస్తున్న ముడి పదార్థాలు, ప్రాసెస్ చేసిన పొడులు, ప్యాకింగ్ సామగ్రి, యంత్రాలను కూడా బృందాలు పరిశీలించాయి. ఈ వ్యవహారంలో సత్యనారాయణ, రుద్రశేఖర్ అనే ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సరుకును మెడిపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఆహార భద్రత, కల్తీ, మిస్‌బ్రాండింగ్‌తో పాటు ఆహార పదార్థాల అక్రమ తయారీ, విక్రయాలకు సంబంధించి వర్తించే చట్ట నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. కల్తీ ఆహారం కంటికి కనిపించని ప్రమాదమని, అందువల్ల వినియోగదారుల అప్రమత్తత కూడా అత్యంత కీలకమని పోలీస్ కమిషనర్ బి. సుమతి పేర్కొన్నారు. పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా తదితర ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలను కొనుగోలు చేసేటప్పుడు కేవలం ప్యాకెట్ రూపాన్ని లేదా బ్రాండ్ పేరును మాత్రమే చూసి కొనుగోలు చేయవద్దని సూచించారు. బ్రాండ్ పేరు, తయారీ తేదీ, గడువు లేదా బెస్ట్ బిఫోర్ తేదీ, బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరాలు తదితర తప్పనిసరి సమాచారాన్ని పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని కోరారు. ప్యాకింగ్ సరిగా లేకపోయినా, లేబులింగ్‌పై అనుమానం వచ్చినా, నాణ్యత విషయంలో సందేహం కలిగినా అలాంటి ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, ప్యాకింగ్ లేదా అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని బి. సుమతి కోరారు. ఒక వినియోగదారుడి అప్రమత్తత అనేక కుటుంబాల ఆరోగ్యాన్ని కాపాడగలదని పేర్కొన్నారు. కల్తీ ఆహార పదార్థాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలపై 8712662111 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ బి. సుమతి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్‌లో ఉప్పల్ జోన్ డీసీపీ కె. సురేష్ కుమార్, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, మెడిపల్లి ఏసీపీ బి. మోహన్ కుమార్, ఎస్ఓటీ మల్కాజిగిరి, ఎస్ఓటీ ఉప్పల్ జోన్, ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ బృందాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు చేరే ఆహారం స్వచ్ఛంగా, సురక్షితంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని, ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఏ అక్రమ వ్యాపారాన్నీ ఉపేక్షించే ప్రసక్తే లేదని, కల్తీకి పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని పోలీస్ కమిషనర్ బి. సుమతి మరోసారి హెచ్చరించారు.

# వర్షపాత లోటుతో రైతులకు ఉత్తమ్ హెచ్చరిక

అంచనాలను ప్రస్తావిస్తూ, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షపాతం లోటు ఉండే సూచనలను వ్యవసాయ, నీటి నిర్వహణ నిర్ణయాలలో పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. "ఎల్ నినో అనేది ఒక ప్రపంచవ్యాప్త వాతావరణ దృగ్విషయం. ఇది హుజూర్‌నగర్, సూర్యాపేట జిల్లా లేదా తెలంగాణకు మాత్రమే పరిమితమైనది కాదు. మనం విస్తృత వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకుని, మనకు వాస్తవంగా అందుబాటులో ఉన్న నీటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలి," అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాబోయే వారాల్లో గణనీయమైన వర్షాలు కురుస్తాయనే లేదా జలాశయాల్లోకి కొత్తగా నీరు చేరుతుందనే అంచనాపై మాత్రమే ఆధారపడి పంటల నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. "పంటలను ఎంచుకునేటప్పుడు రైతులు నీటి లభ్యతను జాగ్రత్తగా అంచనా వేసుకోవాలి. నమ్మకమైన నీరు అందుబాటులో ఉన్న చోటల్లా మనం వ్యవసాయానికి మద్దతు ఇవ్వాలి, కానీ అదే సమయంలో వేసవి కాలం మరియు వచ్చే రుతుపవనాల వరకు తాగునీటి అవసరాల కోసం తగినంత నీటిని కాపాడుకోవాలి," అని ఆయన అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాల మధ్య ప్రభుత్వం వివేకవంతమైన సమతుల్యతను పాటిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. భవిష్యత్ వర్షపాతంపై చేసే అంచనాల ఆధారంగా కాకుండా, వాస్తవంగా వినియోగించగల నీటి నిల్వ, రాబోయే నీటి ప్రవాహాలపై వాస్తవిక అంచనాల ఆధారంగా జలాశయాల నుండి నీటిని విడుదల చేయడంపై నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, కృష్ణా వ్యవస్థపై ఆధారపడిన ప్రాంతాలలో




సాగునీటి భద్రతను బలోపేతం చేయడానికి రూపొందించిన ఎత్తిపోతల పథకం పురోగతిని మంత్రి సమీక్షించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మట్టంపల్లి, మెల్లచెరువు, చింతలపాలెం మండలాల్లోని సుమారు 53,000 ఎకరాలకు సాగునీరు అందించబడుతుంది. దీనివల్ల దాదాపు 19,297 కుటుంబాలు లబ్ధి పొందుతాయి. లబ్ధిదారులలో సుమారు 5,080 గిరిజన కుటుంబాలు, 3,540 షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు ఉన్నాయి. నాగార్జున సాగర్‌లో నీటి లభ్యత సరిపోని కాలాల్లో ప్రత్యామ్నాయ సాగునీటి వనరుగా, పులిచింతల బ్యాక్‌వాటర్స్ నుండి నీటిని ఎత్తిపోసేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. దాదాపు 40 కిలోమీటర్ల కాలువ నెట్‌వర్క్‌లో, సుమారు 30 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. రెండు పంపులు, మోటార్లు ప్రాజెక్టు ప్రదేశానికి చేరుకోగా, మిగిలిన రెండు సెట్లు సెప్టెంబర్ చివరి నాటికి చేరుకుంటాయని భావిస్తున్నారు. డిసెంబర్ నాటికి ప్రధాన భాగాలను పూర్తి చేసే లక్ష్యంతో పంప్ హౌస్, ప్రధాన కాలువ, గేట్ రెగ్యులేటర్, డెలివరీ సిస్టమ్, ఇతర పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంజనీర్లను ఆదేశించారు. సాగునీటి వ్యవస్థ కార్యకలాపాలకు సిద్ధమైనప్పుడు విద్యుత్ మౌలిక సదుపాయాలు అడ్డంకిగా మారకూడదని నొక్కిచెబుతూ, ప్రాజెక్టుకు ప్రత్యేకంగా కేటాయించే 132-కేవీ సబ్‌స్టేషన్ పనులను తక్షణమే వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్షపాత పరిస్థితి రెండు విధాలైన విధానం యొక్క ఆవశ్యకతను స్పష్టం చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు శాశ్వత సాగునీటి మౌలిక సదుపాయాలను వేగవంతం చేయడంతో పాటు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుతూ, జాగ్రత్తగా కేటాయించడం కూడా అవసరమని ఆయన తెలిపారు.

## అరణ్యానికి సాంకేతిక రక్షణ కవచం

అటవీ కార్యకలాపాలపై డిజిటల్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అటవీశాఖ బృందం కర్ణాటకలో మూడు రోజులపాటు పర్యటించింది. కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న ఐటీ విధానాలు, జీఐఎస్, మొబైల్ అప్లికేషన్లు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ తదితర వ్యవస్థలపై అధ్యయనం జరిపి, పూర్తి వివరాలతో కూడిన నివేదికను పవన్ కళ్యాణ్ కి అందజేశారు. తమ పరిశీలనలు, కర్ణాటకలో విజయవంతమైన విధానాలపై పలు సూచనలు చేశారు. ఈ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన కళ్యాణ్ కర్ణాటకలో సత్ఫలితాలు ఇచ్చిన పలు విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేయాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అడవిలో ప్రతి అణువును కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించే విధంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు పట్ల శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆసక్తి కనబర్చారు. జియో-స్పేషియల్ డ్యాష్‌బోర్డ్, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, కెమెరా ట్రాప్‌ల ద్వారా వన్యప్రాణుల సంఖ్యపై ఎప్పటికప్పుడు విశ్లేషణ, అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనాల ట్రాకింగ్, గస్తీ పర్యవేక్షణ, అటవీ అగ్నిప్రమాదాలు, మానవ-వన్యప్రాణి ఘర్షణల పర్యవేక్షణ తదితర కార్యక్రమాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు అటవీ సరిహద్దులకు చట్టబద్ధమైన భద్రతగౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి మార్గనిర్దేశకత్వంలో, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ గారి నాయకత్వంలో ఇప్పటికే అటవీ సరిహద్దుల డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్రంలో కూడా చేపట్టిన విషయాన్ని శ్రీ పవన్ కళ్యాణ్ గారు గుర్తు చేశారు. తద్వారా అటవీ సరిహద్దుల చట్టబద్ధతను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు హనుమాన్ ద్వారా ఇప్పటికే మానవ-వన్యప్రాణుల ఘర్షణల నివారణ, విశ్లేషణ వ్యవస్థలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఏఐ ఆధారిత ప్రమాద అంచనా వ్యవస్థలు, వన్యప్రాణుల సంచారానికి సంబంధించిన డ్యాష్‌బోర్డులు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు.కర్ణాటకతో పరస్పర సాంకేతిక సహకారంఇప్పటికే కర్ణాటక అటవీ శాఖతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం వంటి పలు ఒప్పందాలు చేసుకున్నామని, పరస్పర సాంకేతిక సహకారం దిశగా అడుగులు వేయనున్నట్లు వివరించారు. అందుకోసం ఇరు రాష్ట్రాల అటవీశాఖల ఆధ్వర్యంలో సంయుక్త సాంకేతిక వర్క్‌షాప్‌లు, పత్రాల మార్పిడి, అవసరం ఉన్న చోట సోర్స్ కోడ్ భాగస్వామ్యం, జీఐఎస్‌లో ఉత్తమ విధానాల మార్పిడి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌కు సంబంధించి వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?

దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ధరలతో సామాన్యులు అల్లాడి పోతున్నారు. అయినా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ధరల కట్టడికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఈ వ్యవహారం తమ పరిధిలో లేదన్నరీతిలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. సొంత ఎజెండాలను ముందుకేసుకుని నడుస్తున్నాయి. ప్రజలు ఏమయితేనేమి అన్న భావనలో పాలకుల తీరు ఉంది. ఎన్నికలప్పుడు మేనేజ్ చేయడం నేర్చుకున్న వారు ఆ తరవాత ప్రజలను పట్టించుకోవడం లేదు. ఎదుటి పార్టీలను బురిడీ కొట్టించడం, నానాయాగీ చేయడం తప్ప పాలన కట్టుతప్పి పోతోంది. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఫైన్ రైస్ కిలో బియ్యం ధర 80 రూపాయలకు చేరింది. ఈ ధరలు మరింత పెరుగుతాయని, వందకు చేరుకుంటుందని అంటున్నారు. ఎల్‌నినోతో ఉత్పత్తి తగ్గిందన్న సాకుతో ధరలు పెంచేశారు. అలాగే ఉప్పులు పప్పులు, నూనెల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. మందుల ధరలు కూడా గుట్టుచప్పుడు కాకుండా పెంచేస్తున్నారు. ఇవన్నీ ఎవరి పరిధిలో ఉందో ప్రజలకు తెలియడం లేదు. ఇక కూరగాయల ధరలు కూడా 60 నుంచి వంద వరకు పలుకుతున్నాయి. అయితే ఏపిలో సబ్సిడీ బియ్యం పథకం ప్రారంభించారు. ఇది పెద్దగా ప్రజామోదం పొందలేదు. పాలకులు సొంత ఎజెండాతో, పార్టీ పరంగా విమర్శలు, ప్రతి విమర్శలతో బిజీగా ఉన్నారు. ఏపిలో అప్పుడే ఎన్నికలు వచ్చాయా అన్న రీతిలో వైకాపా, టిడిపి కూటమి పరస్పర విమర్శలు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ నడుస్తున్నా అందులో ధరలపై ఎజెండా లేదు. తెలంగాణలో 22ఎ వ్యవహారం ముదిరింది. ప్రజలను రోడ్డుకీడ్చిన రేవంత్ సర్కార్ వారి నుంచి భూములను లాక్కునే ప్రయత్నంలో ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. మంత్రులంతా వసూళ్లలో పడ్డారని, 30 శాతం కమిషన్ ప్రభుత్వం అని విపక్ష బిఆర్‌ఎస్ విమర్శలు చేస్తోంది. బిఆర్‌ఎస్‌ను విమర్శించడంలో కాంగ్రెస్ బిజీగా ఉంది. ఇక బిజెపి వందేమాతరం, డీలిమిటేషన్, కొత్త కార్యవర్గం కూర్పుతో బిజీగా ఉంది. కాంగ్రెస్ పార్టీ బిజెపిని విమర్శించడం, యువతకు క్షమాపణలు చెప్పండి అన్న పనిలో పడింది. మొత్తంగా దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలన్నీ సొంత ఎజెండాతో నడుస్తున్నాయి. అందువల్ల ధరల దాడి వాటికి పట్టడం లేదు. బిజెపి అయితే కేంద్రంలో అధికారంలో ఉన్నా ఈ వ్యవహారాలను చూడడం లేదు. పార్టీలో కొత్త కార్యవర్గం, రానున్న పలు రాష్ట్రాల ఎన్నికలతో తలమునకలుగా ఉంది. తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో మళ్లీ రామ్ మాధవ్‌కు చోటు



కల్పించారు.దాదాపు ఆరు సంవత్సరాలుగా బీజేపీకి దూరంగా ఉన్న సిద్ధాంతకర్త రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించగా,14 మంది ఉపాధ్యక్షుల్లో 11 మంది, 18 మంది ప్రధాన కార్యదర్శుల్లో 11 మందికి 'సంఘ్' వాసనలు ఉన్నాయని అంటున్నారు. ఎలాంటి సమాచారాన్ని అయినా సత్వరం ప్రచారం చేయగల, ప్రత్యర్థులపై శక్తి సామర్థ్యాలున్న ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయను 11సంవత్సరాల తర్వాత ఆ పదవి నుంచి తొలగించడం, దుందుడుకు భాషను ప్రయోగించే తేజస్వి సూర్యలాంటి వారిని తప్పించడం వంటివి జరిగాయి. ఒకప్పుడు వెంకయ్య, సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్ తదితర దిగ్గజ నేతలతో అలరారిన పార్టీ ఇప్పుడు పేలవంగా తయార వుతోంది. నితీన్ నబీ అధ్యక్షుడు అయ్యాక పార్టీ పెద్దగా ప్రభావశీలంగా కనిపించడం లేదు. గడచిన 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు చెప్పుకోవడానికి ఎప్పుడూ మోడీ ముందుంటారు. అయితే అందులో ధరలు తగ్గించగలిగామని ఎప్పుడూ చెప్పలేదు. ధరలపై సమీక్షకు పెద్దగా సమయం కేటాయించ లేదు. తాజాగా ఇప్పుడు దిమాగీ నక్సల్స్ మాటతో మళ్లీ కొత్త చర్చ లేపారు. అయితే మోదీ ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదు. 12 ఏళ్లు నిరాఘాటంగా పాలించిన అనుభవంతో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పెద్దగా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కేవలం ఎన్నికలు, గెలుపు అన్న ధోరణిలో పాలన సాగిస్తున్నారు. ఈ క్రమంలో పరిశీలిస్తే పాలక పార్టీలు ఏవీ కూడా ధరల గురించి మాట్లాడడం లేదు. 80కి కిలో బియ్యం కొనడమెలా ఆలోచించడం లేదు. జిఎస్టీ వసూళ్లు పెరుగుతున్నాయా లేదా అన్నది చూసుకుంటూ మురిసిపోతున్నారు. ప్రజల విషయంలో ఇప్పటికైనా ఆలోచన చేయాలి. ధరల పెరుగుదలను అరికట్టడమెలా అన్నదానిపై దృష్టి సారించాలి. లేకుంటే వ్యాపారుల ఇష్టారాజ్యంగా మార్కెట్ మారిపోవడం ఖాయం.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ పాత్ర కీలకమైనదని పేర్కొన్నారు. కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి పునాదులు వేయడంతో పాటు 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత ఆయనదేనని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బైక్‌పై వెళ్లి డీ-8 కెనాల్‌ను పరిశీలించిన మంత్రి జూపల్లి

**- సాగునీటి విడుదలపై అధికారులతో ఆరా**
**- చివరి ఆయకట్టు వరకూ నీరందించాలని ఆదేశం**
**- ప్రతి నీటి బొట్టునూ పొదుపుగా వాడుకోవాలి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ–8 కెనాల్ పరిధిలోని సాగునీటి కాలువలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా బైక్‌పై పర్యటించి పరిశీలించారు. తూడుకుర్తి సమీపంలోని ప్రధాన కాలువ నుంచి ప్రారంభించి సాకర్పల్లి, ఏదుట్ల, గోపాల్‌పేట, రేమద్దుల, సింగాయిపల్లి, తురకపల్లి, గోపులాపురం పరిధిలోని కాలువల్లో నీటి ప్రవాహాన్ని, ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

*- చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలి*

కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీల ద్వారా విడుదల చేస్తున్న నీటి పరిమాణం, ఆయకట్టుకు అందుతున్న తీరుపై సాగునీటిపారుదల శాఖ అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. కాలువల చివరి భూములకు సాగునీరు సక్రమంగా చేరుతుందో లేదో ప్రత్యక్షంగా ఆరా తీశారు. క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకుంటూ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

*- నీటి వృథా సహించేది లేదు*

ప్రస్తుత పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని లభ్యతలో ఉన్న ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. "నీటిని ఏమాత్రం వృథా చేయకుండా పొదుపుగా







వినియోగించాలి. అందుబాటులో ఉన్న జలాలతోనే గరిష్ఠ విస్తీర్ణంలో పంటలకు నీరందేలా పటిష్ఠమైన ప్రణాళికతో ముందడుగు వేయాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

*- అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలి*

కాలువలు, డిస్ట్రిబ్యూటరీల్లో నీటి ప్రవాహం, సాగునీటి సరఫరా ప్రక్రియను నీటిపారుదల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడా కట్టలు తెగకుండా, నీరు వృథా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో పాటు, చివరి భూముల రైతులకు నీటి కొరత రాకుండా సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోవర్ధన్, కోడేరు మాజీ ఎంపీపీ రామ్మోహన్ రావులతో పాటు సాగునీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వనపర్తి రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం, యూత్ కాంగ్రెస్ మరియు నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఫారం–6ను విడుదల చేశారు. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయోపరిమితిని 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే గుర్తుచేశారు.ఓటు హక్కు ప్రతి పౌరుడి చేతిలో ఉన్న శక్తివంతమైన ఆయుధమని, మంచి నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారానే లభిస్తుందని పేర్కొన్నారు. తొలిసారి ఓటు పొందుతున్న యువత బాధ్యతగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థల పరిధిలో అర్హులైన యువతను గుర్తించి ఫారం–6 ద్వారా ఓటు నమోదు చేయించేలా యూత్ కాంగ్రెస్, నాయకులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, నాయకులు శ్రీకాంత్, దివాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా.**
**- భూభారతి, మీ-సేవ పెండింగ్ దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి.**
**- డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.**

మహబూబ్ నగర్ ఆగస్ట్ 20 ( విజన్ ఆంధ్ర)జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి నిర్వహించిన వి.సి సమీక్ష సమావేశంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా, కొత్త ఇసుక, మోరం, మట్టి క్వారీల గుర్తింపు, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, భూ రిజిస్ట్రేషన్లు, రిసర్వే, భూభారతి, మీ–సేవ, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. అడ్డకల్, భూత్పూర్, మూసాపేట, బాలానగర్, జడ్చర్ల, చిన్నచింతకుంట, కౌకుంట్ల, గండీడ్ మండలాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఇప్పటివరకు అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన ఎన్ని వాహనాలను సీజ్ చేశారో తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. అక్రమ ఇసుక రవాణాపై సమాచారం, వార్తలు వస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో తగిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అక్రమ తవ్వకాలు, రవాణాపై నిరంతరం నిఘా ఉంచి వాహనాలను సీజ్ చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలింపునకు నిర్దేశించిన సమయాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని, రవాణా వాహనాలను జీపీఎస్ ద్వారా పర్యవేక్షించడంతో పాటు వీడియో ఆధారాలను నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఇసుక రీచ్‌లను చట్టబద్ధంగా వేలం ద్వారా నిర్వహించే విధానానికి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.





*- భూభారతి, మీ–సేవ పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి*

భూభారతి, మీ–సేవ పోర్టళ్లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ ఫైళ్లను యుద్ధప్రాతిపదికన పరిశీలించి, సాధ్యమైనంత వరకు మరుసటి రోజులోగా క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్లు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యాలయాలకు కేటాయించిన నిర్వహణ, ఇతర అవసరాల నిధులను వెంటనే వినియోగించి స్కానర్లు, ప్రింటర్లు, కంప్యూటర్లు వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలని సూచించారు. సిబ్బంది పనిభారాన్ని సమతుల్యం చేయడంతో పాటు జూనియర్ అసిస్టెంట్లకు అవసరమైన శిక్షణ అందించి వారి పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రతిరోజూ పురోగతి నివేదికలు సమర్పిస్తూ, నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు.

*- డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక వేగవంతం*

జిల్లాలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై మండలాల వారీగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఇంజనీర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి మండలంలో ఇళ్ల నిర్మాణ పరిస్థితి, లబ్ధిదారుల వివరాలు, పెండింగ్ దరఖాస్తులు, భౌతిక పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల దరఖాస్తులకు ఎంపీడీవోల ద్వారా యూనిక్ ఐడీ నంబర్లు జనరేట్ చేసి, అవి ఆన్‌లైన్ వ్యవస్థలో కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజిటల్ నమోదుతో పాటు లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల జాబితాలకు ఆమోదం పొందడంతో పాటు సంబంధిత ప్రజాప్రతినిధుల ధ్రువీకరణ, అవసరమైన అధికారిక అనుమతులు పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. అన్ని ప్రక్రియలు పూర్తయిన అనంతరం మాత్రమే కేంద్రకృత ఎంఐఎస్ పోర్టల్ ద్వారా నిధుల విడుదలకు అవకాశం ఉంటుందని తెలిపారుమండలాల వారీగా క్షేత్రస్థాయి వివరాలు, ఆన్‌లైన్ నమోదులు, భౌతిక పురోగతి మధ్య ఎలాంటి వ్యత్యాసం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.


*- 22ఏ భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలి*

భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన 22ఏ నిషేధిత జాబితా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేట్ పట్టా భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాల్లో ఉన్న వ్యత్యాసాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత నివేదికలను 24 గంటల్లోగా సమర్పించాలని సూచించారు. ప్రజల భూ లావాదేవీలకు అనవసర జాప్యం కలగకుండా రెవెన్యూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

*- రిసర్వే పనులను వేగవంతం చేయాలి*


లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా చేపడుతున్న రిసర్వే పనులు ఆశించిన స్థాయిలో వేగంగా సాగడం లేదని గుర్తించిన కలెక్టర్, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రజల భూ లావాదేవీలకు రెవెన్యూ సంబంధిత ప్రక్రియలు అడ్డంకిగా మారకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి అశోక్, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మిడ్జిల్ .మండలం కొత్తపల్లి లో అక్రమంగా ఇసుకను మట్టితో కప్పివేత ఘటనపై సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు



మహబూబ్ నగర్ (విజన్ ఆంధ్ర) మండలం కోతపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 96లో సీజ్ చేసిన సుమారు 15,829 క్యూబిక్ మీటర్ల ఇసుకను అక్రమంగా మట్టి గుంతలతో కప్పివేసిన ఘటనపై గనులు,భూ గర్భ శాఖ ,రెవెన్యూ అధికారులు చట్ట పరంగా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకొని కేసు నమోదు చేశారు కోతపల్లి గ్రామంలో సీజ్ చేసిన ఇసుకను తెలంగాణ ఇసుక మైనింగ్ నిబంధనలు2015 ప్రకారం వేలం ద్వారా విక్రయించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ, చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు సీజ్ చేసిన ఇసుకను వేలం వేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా గురువారం వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ఆగస్టు 18 న అర్ధరాత్రి సమయంలో భూయజమానుల ప్రతినిధులుగా పేర్కొన్న చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణారెడ్డి హిటాచీ, డోజర్లను ఉపయోగించి సీజ్ చేసిన ఇసుకను మట్టి గుంతలతో కప్పివేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని వెంటనే గనులు, భూగర్భ వనరుల శాఖ సహాయ సంచాలకులకు తెలియజేశారు. దీంతో గనులు, భూగర్భ వనరుల శాఖ సహాయ సంచాలకులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆగస్టు 19 న సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. అనంతరం సంబంధిత వ్యక్తులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన ఇసుకను అక్రమంగా మట్టితో కప్పివేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 79,14,500/- (రూపాయలు డెబ్బై తొమ్మిది లక్షల పద్నాలుగు వేల ఐదు వందలు) మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన ఇసుకను అక్రమంగా తరలించడం, దాచడం లేదా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



మహబూబ్‌నగర్, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర): ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఎ. శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ నగరంలోని గాంధీ న్యూరో హాస్పిటల్, శ్వేత నర్సింగ్ హోమ్, గౌతమీ హాస్పిటల్, మైత్రి హాస్పిటల్ తదితర ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన రుసుముల వివరాలను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రిసెప్షన్ వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. వైద్యులు, సిబ్బందిలో మార్పులు జరిగినప్పుడు వారి వివరాలను జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి తప్పనిసరిగా అందజేయాలని తెలిపారు. బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా ట్రీట్‌మెంట్ సంస్థకు తరలించి, అందుకు సంబంధించిన రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎయిడ్స్, లెప్రసీ ప్రోగ్రాం అధికారి డా. రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, ఎంపీహెచ్ఈవో సుభాష్ చంద్ర పాల్గొన్నారు.

# మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

**- ప్రసవం కోసం వెళ్లిన సమయంలో నిర్లక్ష్యంగా సర్జరీ**



ముంబై,ఆగస్ట్20 :ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత ఆమె కడుపులోనే గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ వదిలేసి కుట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపునొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. వడ్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఆగస్టు 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా ఆస్పత్రిలో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. మహిళ ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన స్కానింగ్‌లో ఆమె కడుపులో ఏవో వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. రిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను పుణెలోని సాసూన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి, ఆమె కడుపులో ఉన్న గ్లౌజులు, పేపర్ వైప్స్ ఉన్నట్లు గుర్తించి వాటిని తొలగించారు. తన భార్య పరిస్థితికి మొదటి ఆపరేషన్‌లో జరిగిన నిర్లక్ష్యమే కారణమని సంధ్య భర్త సూరజ్ గైక్వాడ్ ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు.

# 10 సంవత్సరాల పాలనలో చేయని అభివృద్ధి

- రెండున్నర సంవత్సరాల్లో అభివృద్ధి మార్గంలో కందనూలు
- మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర



నాగర్ కర్నూల్ జిల్లా, ప్రతినిధి, (విజన్ ఆంధ్ర): ఆగస్టు 20 : నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో గత పాలకుల చేయని అభివృద్ధి రెండున్నర సంవత్సరాల్లోనే వీధివీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం నూతన బస్టాండ్ శంకుస్థాపన హాస్పిటల్ ఎన్నో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగింది మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి మార్గంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పాలకులను విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి లేదని ఆయన విమర్శించారు. అదేవిధంగా నాగర్ కర్నూల్ పట్టణంలో వీధి వీధికి రోడ్లను తవ్వించి కాంట్రాక్టర్లను నానా ఇబ్బందులకు గురిచేసిన నాయకులు మర్రి జనార్దన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పదవి అనామకునికి ఇచ్చుకొని ఇష్టం వచ్చినట్టుగా నిధులు దుర్వినియోగం చేయడం ఇష్టానుసారంగా తీర్మానాలు రాసుకోవడం మర్రి జనార్దన్ రెడ్డి పరిపాలన విధానం అని ఆయన అన్నారు. అదేవిధంగా వ్యాపారస్తుల దగ్గర ఇష్టానుసారంగా బెదిరించి కమిషన్లు తీసుకున్న ఘనత ఆయనకే దక్కిందని ఆయన అన్నారు. ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకొని విలువలతో కూడినటువంటి రాజకీయ ప్రసంగం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం పరమేష్, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులుజక్కా రాజ్ కుమార్ రెడ్డి , ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ వంకేశ్వరం నిరంజన్, మైనార్టీ నాయకులు హబీబీ, జెట్టి ధర్మరాజు, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు హరీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలో 21 నుంచి ప్రత్యేక 'సదరం' క్యాంపులు

వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : అర్హులైన దివ్యాంగులకు సదరం ధృవీకరణ పత్రాలు జారీ చేసేందుకు ఈ నెల 21, 22, 24 తేదీలలో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డిఆర్డిఏ పీడీ రామ మహేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 21 (ఉదయం 9:00 గంటల నుంచి) ఆర్థోపెడిక్ దివ్యాంగులకు. ఆగస్టు 22 దృష్టి లోపం (ఆప్తాలమాలజీ) ఉన్న దివ్యాంగులకు. ఆగస్టు 24 వినికిడి లోపం (హియరింగ్) ఉన్న దివ్యాంగులకు. ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు ఆయా తేదీల్లో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి హాజరై సదరం సర్టిఫికెట్లు పొందే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీ కోరారు.ద

## డయాబెటిక్ కేర్ సెంటర్ ప్రారంభం..!




కా్రపా/ ఆగస్టు 20( విజన్ ఆంధ్ర ప్రతినిధి) : అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు ప్రజాసేవలు చేయడానికి ముందుకు రావాలని. ఎం.ఎస్ రెడ్డి లయన్ ఐ హాస్పిటల్ వైస్ చైర్మన్ చాల్లా లోహిత్ రెడ్డి, సల్ల విజయలక్ష్మి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మీర్ పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ కాలనీలో. యం.ఎస్. ( మేడపాటి సత్యనారాయణ) రెడ్డి లయన్ (ఐ– హాస్పిటల్ ) కంటి ఆస్పత్రిలో నూతనంగా డయాబెటిక్ కేర్ సెంటర్ చల్ల లోహిత్ రెడ్డి, చల్ల విజయలక్ష్మి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్ చల్ల లోహిత్ రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో స్వార్థం పెరిగిపోయి అనర్థాలకు దారితీస్తున్నాయని నేటి యువతీ యువకులు సమాజసేవలో పాల్గొనాలని చల్ల రోహిత్ రెడ్డి చల్ల విజయలక్ష్మిలు కోరారు. ఇప్పటికే మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ లో లయన్ ఆస్పత్రి లో. ఎంతోమంది పేదలకు కంటి ఆపరేషన్లు. కంటి వైద్యం చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని అన్నారు చల్ల లోహిత్ రెడ్డి. చల్ల విజయలక్ష్మి రెడ్డిలు సొంతంగా 10 లక్షల రూపాయలు వెచ్చించి డయాబెటిక్ కేర్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ ఇద్దరి దంపతులను లైన్స్ క్లబ్ లయన్ ఐ ఆస్పత్రి చైర్మన్ రామ్ చందర్ మనస్ఫూర్తిగా అభినందించారు. వీరిద్దరూ ఆదర్శప్రాయులుగా నిలుస్తారని కొనియాడారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంబర్లు, చైర్మన్ రామచందర్, ప్రధాన కార్యదర్శి రమేష్ పొలాస, కోశాధికారి అంజిరెడ్డి, ముఖ్య సలహాదారు ప్రదీప్ పటేల్, సలహాదారు రాములు, ఉప చైర్మన్లు బి.యన్.రెడ్డి,సత్య రెడ్డి, కృష్ణమూర్తి, మల్లేశం, బీ. శ్రీ రెడ్డి, మునిరత్నం రెడ్డి, గోపాల్ రెడ్డి, రామ్ నివాస్, భరత్ స్వామి, మల్లారెడ్డి, మోహన్ దాస్,ముత్యంరెడ్డి, నారాయణ రాజేందరు, మేడపాటి వెంకటసుబ్బారెడ్డి, వేముల వీర మల్లు, పి. ఆనంద్, రెనార్డు ఫ్రాన్స్ వాష్ తదితరులు పాల్గొన్నారు

దక్షిణ మధ్య రైల్వే
X @SCRailwayindia లో అనుసరించండి
ద.మ. రైల్వే టెండర్ నోటీసుల వివరాలకు
వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in

S/13/Auc. Prog/26-27 తేదీ: 14.08.2026

సెప్టెంబర్, అక్టోబర్ & నవంబర్ - 2026 నెలలకు ఈ-వేలం కార్యక్రమం.

PUB/585/26

| సెప్టెంబర్ ఈ-వేలం -2026 | |
|---|---|
| తేదీ | డివిజన్లు/డిపోలు |
| 01.09.26 | సికింద్రాబాద్ |
| 03.09.26 | నాందేడ్ |
| 07.09.26 | హైదరాబాద్ |
| 08.09.26 | లాల్‌గూడ |
| 10.09.26 | సికింద్రాబాద్ |
| 15.09.26 | నాందేడ్ |
| 17.09.26 | హైదరాబాద్ |
| 21.09.26 | లాల్‌గూడ |
| 23.09.26 | సికింద్రాబాద్ |
| 25.09.26 | నాందేడ్ |
| 28.09.26 | హైదరాబాద్ |
| 29.09.26 | లాల్‌గూడ |
| అక్టోబర్ ఈ-వేలం -2026 | |
| తేదీ | డివిజన్లు/డిపోలు |
| 01.10.26 | సికింద్రాబాద్ |
| 05.10.26 | నాందేడ్ |
| 07.10.26 | హైదరాబాద్ |
| 09.10.26 | లాల్‌గూడ |
| 12.10.26 | సికింద్రాబాద్ |
| 15.10.26 | నాందేడ్ |
| 19.10.26 | హైదరాబాద్ |
| 22.10.26 | లాల్‌గూడ |
| 26.10.26 | సికింద్రాబాద్ |
| 28.10.26 | నాందేడ్ |
| 29.10.26 | హైదరాబాద్ |
| 30.10.26 | లాల్‌గూడ |
| నవంబర్ ఈ-వేలం -2026 | |
| తేదీ | డివిజన్లు/డిపోలు |
| 02.11.26 | సికింద్రాబాద్ |
| 04.11.26 | నాందేడ్ |
| 06.11.26 | హైదరాబాద్ |
| 10.11.26 | లాల్‌గూడ |
| 12.11.26 | సికింద్రాబాద్ |
| 16.11.26 | నాందేడ్ |
| 18.11.26 | హైదరాబాద్ |
| 20.11.26 | లాల్‌గూడ |
| 23.11.26 | సికింద్రాబాద్ |
| 25.11.26 | నాందేడ్ |
| 26.11.26 | హైదరాబాద్ |
| 27.11.26 | లాల్‌గూడ |

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్/ సికింద్రాబాద్
A679

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం, టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి వెబ్‌సైట్‌ను చూడండి: https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

## ఎస్ఎస్‌సీ ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి




వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : రాబోయే పదో తరగతి పరీక్షల ఫలితాల్లో వనపర్తి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా పటిష్ట కార్యాచరణతో పనిచేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి మండల విద్యాధికారులతో (ఎంఈఓ) నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణితం, భౌతికశాస్త్రం, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. ప్రత్యేక మెటీరియల్‌తో బోధన అందిస్తూ, రెండు నెలల తర్వాత మళ్లీ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల పురోగతిని అంచనా వేయాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ కనీసం ఒక జత యూనిఫాం తక్షణమే అందేలా మండలాల వారీగా చర్యలు తీసుకోవాలి. పాఠశాల మారిన విద్యార్థులకు సంబంధించిన డ్రాప్‌బాక్స్ పెండింగ్ వివరాలను వారం రోజుల్లోగా పూర్తి చేయాలి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు కూడా స్పష్టమైన సూచనలు ఇవ్వాలి. ఎంఈఓలు నిరంతరం పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యాబోధన, ప్రత్యేక తరగతులు, విద్యార్థుల హాజరును పర్యవేక్షించాలి.

# విజన్ ఆంధ్ర కథనానికి స్పందన

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇరిగేషన్ ఎస్సీకి ఫోన్ ద్వారా సమాచారం

# పూర్తిగా నివేదిక ఇవ్వండి



విజన్ ఆంధ్ర సంగారెడ్డి డిస్క్ ఆగస్టు20, చేపల చెరువు కోసం అక్రమంగా వాల్టా చట్టాన్ని అధిక మించి కాల్వ త్రవ్వకం అనే వార్తకు స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రతీక జైన్ గురువారం ఇరిగేషన్ ఎస్సికి ఫోన్ చేసి పూర్తి నివేదిక అందించాలని సూచించారు.బుధవారం విజన్ ఆంధ్ర దినపత్రికలో వార్త ప్రచురించగా కంసాన్పల్లి యువకులు గురువారం వార్త క్లిప్పింగ్ తో జిల్లా కలెక్టర్ ప్రతీక జైన్ దృష్టికి తీసుకుపోయారు.ఇందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే ఇరిగేషన్ ఎస్సికి ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకున్నారు.వెంటనే పూర్తి నివేదిక ఇవ్వాలని సూచించారు. కంసాన్పల్లి భూములను పరిరక్షించాలని, అన్యాక్రాంతమవుతున్న భూములను సర్వే చేయించి హద్దులు వేయాలని దీనికి పరిరక్షణ చర్యలు చేపట్టాలని శాశ్వత







భూహద్దులు ఏర్పాటు చేసి అధికార నిర్ధారణ చేసి భూ పరిరక్షణ చేపట్టాలని గ్రామ యువకులు లక్ష్మయ్య, రాములు,బాలరాజు, మహేష్,ఆసిఫ్,నవీన్, యాదయ్య, ఆంజనేయులు,అంజి, పాపయ్య,రమేష్, గోవర్ధన్,తదితరులు కోరారు. కలెక్టర్‌కు కన్సాన్‌పల్లి యువకుల ఫిర్యాదు సంయుక్త సర్వేతో వాస్తవాలు వెలికితీయాలని డిమాండ్. ఇటీవల కన్సాన్‌పల్లి పెద్ద చెరువు చర్చనీయాంశంగా మారింది.చెరువు పరిరక్షణపై గ్రామస్తులు ఫిర్యాదుల పర్వం మొదలెట్టారు.చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపల చెరువులు ఏర్పాటు చేయడంతో పాటు మట్టి తవ్వకాలు,కాలువల నిర్మాణం,ప్రైవేట్ చేపల చెరువులకు నీటి తరలింపు జరుగుతున్నాయంటూ కన్సాన్‌పల్లి గ్రామ యువకులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.చెరువు అసలు హద్దులు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిని అధికారికంగా తేల్చి ఆక్రమణలపై చర్యలు



తీసుకోవాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు జిల్లాల భూసరిహద్దులను చూపించాలని గురువారం వినతిపత్రం అందజేశారు. మూడు గ్రామాలకు ఆధారమైన పెద్ద చెరువు కన్సాన్‌పల్లి పెద్ద చెరువు ఆందోల్ మండలంలోని కన్సాన్‌పల్లి, శేరిమల్లారెడ్డిపల్లి, మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్, వట్పల్లి మండలంలోని బిజిలీపూర్, బుద్దాయిపల్లి, కేరూర్ గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది.ఈ చెరువు కన్సాన్ పల్లి, శేరిమల్లారెడ్డి పల్లి, రాంసాన్ పల్లి గ్రామాల వ్యవసాయానికి కీలక నీటి వనరుగా ఉందని గ్రామస్తులు తెలిపారు. చెరువు విస్తీర్ణం,హద్దులు స్పష్టంగా లేకపోవడం భవిష్యత్‌లో ఆక్రమణలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఎఫ్‌టీఎల్‌లో ఏం జరుగుతోంది?



ఇటీవల చెరువు పరిధిలో మట్టి తవ్వకాలు, కాలువల నిర్మాణం, ప్రైవేట్ చేపల చెరువులకు నీటి తరలింపు వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి.దీంతో అసలు చెరువు శిఖం ఎంత? ఎఫ్‌టీఎల్ ఎక్కడి వరకు ఉంది? ఏ సర్వే నంబర్లు చెరువు పరిధిలోకి వస్తాయి? అనే అంశాలపై స్పష్టత అవసరమని యువకులు కోరుతున్నారు.అధికారిక రికార్డుల ఆధారంగా హద్దులను గుర్తించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పాత రెవెన్యూ,ఇరిగేషన్ రికార్డులు,మ్యాపులు, సర్వే నంబర్లను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని యువకులు కోరారు. కేవలం రికార్డుల పరిశీలనతో కాకుండా చెరువు చుట్టూ జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించి నిజాలను నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు.

### నీటి తరలింపుపైనా విచారణ

చెరువు నుండి విద్యుత్ మోటార్ ద్వారా అక్రమంగా నీటిని తరలించిన వారిపై చర్య తీసుకోవాలని కోరారు. చెరువు నుంచి ప్రైవేట్ చేపల చెరువులకు నీటిని తరలించేందుకు అనుమతులు ఉన్నాయా? కాలువలు,మోటార్ల ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### సంయుక్త బృందంతో సర్వే చేయాలి

రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేసి తక్షణమే క్షేత్రస్థాయి సర్వే, భూస్థల పరిశీలన చేపట్టాలని యువకులు కోరారు. చెరువు శిఖం,ఎఫ్‌టీఎల్, సర్వే హద్దులను గుర్తించి శాశ్వతంగా హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

### చెరువు భూములకు రక్షణ ఎప్పుడో?

భవిష్యత్‌లో ఆక్రమణలకు అవకాశం లేకుండా చెరువు పరిధిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామ యువకులు కోరారు. చెరువు హద్దులను ప్రజలకు స్పష్టంగా తెలియజేసి, ఎఫ్‌టీఎల్ పరిధిలోని చేపల చెరువులు,నిర్మాణాలు, మట్టి తవ్వకాలు, కాలువలను సమగ్రంగా పరిశీలించి చెరువు భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంయుక్త సర్వే నిర్వహిస్తారా? చెరువు హద్దులు, ఎఫ్‌టీఎల్‌పై స్పష్టత ఇస్తారా? అన్నది వేచి చూడాలి మరి.

## అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్న అభ్యాసకులు

- చదువుకు వయస్సు అడ్డంకి కాదు అక్షరాస్యతతో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెరుగుతాయి
- కలెక్టర్ కె కిరణ్మయి





రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 20, ( విజన్ ఆంధ్ర ) : చదువుకు వయసు అడ్డు కాదు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి అన్నారు. ఆమె ఆదేశాల మేరకు గురువారం చంపాపేట ప్రాథమిక పాఠశాలలో పాఠశాల సమయం అనంతరం సాయంత్రం 4 గంటలకు యుఎల్ఎల్ఏఎస్ అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యాసకులు "అక్షర వికాసం" వాచకం ద్వారా చదవడం, రాయడం నేర్చుకుంటూ ఉత్సాహంగా విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. అక్షరజ్ఞానం లేని వారికి చదవడం, రాయడం నేర్పించి వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే యూ ఎల్ఎల్ఏఎస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా విద్యను అభ్యసిస్తూ అక్షరజ్ఞానం సాధించేందుకు అభ్యాసకులు చూపుతున్న ఆసక్తి, పట్టుదల అభినందనీయమని పేర్కొన్నారు. "చదువుకు వయస్సు అడ్డంకి కాదు అక్షరాస్యతతో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెరుగుతాయి" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ అక్షరాస్యత సాధించే దిశగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : జీవో నంబర్ 97, 'శక్తి' స్కీమ్‌ల వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల్లో వ్యక్తమవుతున్న సందేహాలను, వారి విద్యా భవిష్యత్తు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యాసంస్థల ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలను నిలిపివేయాలని కోరుతూ వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో 97 అమలు, పాలిటెక్నిక్ సంస్థలను ప్రైవేటు రంగానికి అప్పగించే ప్రయత్నాలపై విద్యార్థులు తమ తీవ్ర ఆందోళనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను సానుకూలంగా విన్న




ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జీవో 97, శక్తి స్కీమ్‌లకు సంబంధించిన అంశాలను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా, వారి భవిష్యత్తు దెబ్బతినకుండా కాపాడేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## నీరుకొండ సుశీలమ్మ దశదిన కర్మకు నివాళులు..!





కా్రపా/ ఆగస్టు 20(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఖమ్మం జిల్లా మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లెందులపాడు గ్రామంలో గురువారం ఉప్పల్ నియోజకవర్గ టీ.టీ.డీ.పీ. సీనియర్ నాయకుడు రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్‌బాబు మాతృమూర్తి నీరుకొండ సుశీలమ్మ దశదిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి, పెద్దాపురం కుమార్‌స్వామి, చిందం బాలనరసింహ, సింగం రాజు, ముదిగొండ పాండు, రామ్మోహన్ రావు, అతిథి రాజు, నిరుగొండ ప్రసాద్ ,తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

# నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 ( విజన్ ఆంధ్ర ) : ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చె+సి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటరు జాబితా, మండలాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ వివరాలు, నోటీసులు జారీ చేసి చెక్ చేయాలనీ,7 రోజు లు టైమిచ్చి పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా నో మ్యాపింగ్, అనామలిస్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎ.ఈ.ఆర్.ఓ. లను కేటాయించి, వారికి కొత్త లాగిన్లు ఏర్పాటు చేసి, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని,నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు , సమగ్ర సర్వే లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఎం పి డి ఓ లు, తహసీల్దార్ లు సమన్వయంతో పని చేసి నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను నిర్ణత సమయం లో పూర్తి చేయాలనీ, గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సమీక్ష సమావేశం. జిల్లాలో చేయూత పింఛన్ల పంపిణీ, అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు, అలాగే ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు . ఈ సందర్భంగా మండలాల వారీగా చేయూత పింఛన్ల పరిస్థితి, కొత్తగా అర్హత పొందిన లబ్ధిదారుల వివరాలు, పెండింగ్ దరఖాస్తులు తదితర అంశాలపై సమీక్షించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పింఛన్లకు సంబంధించి అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ప్రయోజనం పొందని వారి వివరాలను గుర్తించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి మండలాల వారీగా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీఓలకు సూచించారు.వప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యత కల్పించాలని, దరఖాస్తుల పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలకు పథకాలపై సరైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు అంతకు ముందు జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ చేయూత పెన్షన్ ల దరఖాస్తు లు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు ల పై మండలం వారీగా జనాభా ను బట్టి ఎన్ని దరఖాస్తు లు వచ్చాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణలత, ఆర్ డి ఓ వాసు చంద్ర,సంబంధిత జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

**- ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు**



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు20( విజన్ ఆంధ్ర); ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి ఏదో ఒక రూపంలో అందుతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట మున్సిపాలిటీకి చెందిన పెన్మటెచ్చా సురేష్ సీఎం సహాయ నిధి 1, 75లక్ష విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే గారు లబ్ధిదారులకు అందజేశారు. ఇళ్లకు నేరుగా వెళ్లిన ఎమ్మెల్యే గారు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.భవిష్యత్తులో ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్య ఎదురైనా తనను లేదా తన కార్యాలయాన్ని వెంటనే సంప్రదించాలని లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు.ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను అర్హులైన వారికి అందజేస్తామన్నారు.నేరుగా పథకాలు అర్హులైన వారికి ఇంటికే చేరవేరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేందర్ ,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షులు గోశాల వెంకన్న,ఇల్లంద మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్, సర్పంచ్లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ( విజన్ ఆంధ్ర ) : బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత కల్పిస్తూ బ్యాంకర్లు ముందుకు సాగాలన్నారు. ప్రతి రంగాల్లో సామాజిక న్యాయం జరిగేలా రుణాలను అందజేయాలని ఆయన బ్యాంకర్లకు సూచించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు క్రాప్ లోన్ రుణాలు అందజేయాలనీ, పంట రుణాలకు సంబందించి రేనివాల్ చేయాలనీ బ్యాంకర్ల కు ఆదేశించారు. జిల్లాలోని మహిళా సంఘాలకు లక్ష్యం మేరకు రుణాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ యాదగిరి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ , నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అఖిల్, బ్యాంకు మేనేజర్లు డిఆర్డిఓ శ్రీనివాస్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి కుమార్, జిల్లా పశు సంవర్ధక అధికారి సదానందం, ఎస్సీ, బీసీ అధికారులు,జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహేశ్వర్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ పిఎసిఎస్ రద్దు జీవో ఉపసంహరణ

**- మంజులారెడ్డి పాలకవర్గం కొనసాగింపునకు కోర్టు ఆదేశం**

**- రైతులకు ఊరట, సభ్యుల్లో హర్షం**

**- ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర,ఆగస్టు 20:**




ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గంలోని మేకగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మంజులారెడ్డి మరియు వారి పాలకవర్గాన్ని, అలాగే కొందుర్గు పిఎసిఎస్ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోను తాజాగా ఉపసంహరించుకుంది. ప్రభుత్వం జీవోను వెనక్కి తీసుకున్న వెంటనే అదే పాలకవర్గాన్ని యథావిధిగా కొనసాగించాలని గౌరవ న్యాయమూర్తి శ్రవణ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మేకగూడ పిఎసిఎస్ చైర్మన్‌గా ఉన్న మంజులారెడ్డి నాయకత్వంలోని పాలకవర్గం గత కొంతకాలంగా రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాల పంపిణీలో కీలకంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం రద్దు జీవో ఇవ్వడంతో సభ్యుల్లో ఆందోళన నెలకొంది. అయితే ప్రభుత్వమే ఆ జీవోను ఉపసంహరించుకోవడం, కోర్టు అదే పాలకవర్గాన్ని కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఇప్పుడు పిఎసిఎస్ కార్యకలాపాలు ఎలాంటి ఆటంకం లేకుండా సాగనున్నాయి.ఈ తీర్పుతో మేకగూడ, కొందుర్గు పిఎసిఎస్ పరిధిలోని రైతులు, సభ్యులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్ మంజులారెడ్డి నాయకత్వంలోనే సంఘం బాగా పనిచేస్తుందని, రైతుల సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని సభ్యులు అభిప్రాయపడ్డారు. పిఎసిఎస్ సేవలు నిరంతరాయంగా కొనసాగడం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని నాయకులు పేర్కొన్నారు.కోర్టు ఆదేశాలతో పాలకవర్గ సభ్యులు కూడా ఉత్సాహంగా విధుల్లో పాల్గొంటున్నారు. రానున్న రోజుల్లో రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని చైర్మన్ మంజులారెడ్డి తెలిపారు.

## నేడు విద్యాసంస్థల బంద్ కు ట్రస్మ పిలుపు

నారాయణపేట , ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : నల్గొండ జిల్లా కొండమల్లెపల్లి మండలం జేపి కాలనీలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.రూపా రెడ్డిని ఈ నెల 11న అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు అతి దారుణంగా హత్య చేసిన ఘోర సంఘటనను ట్రస్మ నారాయణపేట జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కే.సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయడంతో పాటు పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం డీఈఓ గోవిందరాజులను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులలో మార్పు తీసుకుని రావడానికి తల్లిదండ్రులు, సమాజం కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్ కుమార్, ఈసీ నెంబర్ మహేష్, పట్టణ అధ్యక్షులు ఖదీర్ పాల్గొన్నారు.

## సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పనితీరు అద్భుతం..





సూర్యాపేట ఆగస్టు 20:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి వైబ్రెంట్‌గా, యాక్టివ్‌గా పనిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశంసించారు.వ్యవసాయ మార్కెట్‌లో రూ.3.80 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులు, గాల్‌వాల్యూమ్ షెడ్, పీవీ పవర్ ప్లాంట్, రూఫ్‌టాప్ సోలార్ నిర్మాణ పనులకు తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు ఉచితంగా అల్పాహారం అందించడం, కేవలం రూ.5కే మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. సూర్యాపేట మార్కెట్‌లో అమలు చేస్తున్న ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా మార్కెటింగ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి ఏకరూప దుస్తులు అందించడం, రైతులు మరియు మార్కెట్‌కు వచ్చే ప్రజలకు చల్లని నీటి సౌకర్యం కల్పించడం పట్ల మంత్రి అభినందనలు తెలిపారు. సూర్యాపేట మార్కెట్ కమిటీ పనితీరు తనను ఆకట్టుకుందని, త్వరలో మరోసారి మార్కెట్‌కు వచ్చి సుమారు రెండు గంటల పాటు సమయం కేటాయించి మార్కెట్‌లో జరుగుతున్న కార్యకలాపాలను స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. అలాగే సూర్యాపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అభివృద్ధి కోసం రూ.95 లక్షలు అందజేస్తామని మంత్రి ప్రకటించారు. మామిడి మార్కెట్ ఏర్పాటుకు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి కె నరసింహ, మార్కెట్ కార్యదర్శి ముక్రం,చెవిటి వెంకన్న,ఆర్ డిఓ వేణు మాధవ్, మార్కెట్ డైరెక్టర్ లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దిరెడ్డి రాజా, రవి,మార్కెట్ సిబ్బంది కాశీం, తదితరులు పాల్గొన్నారు.

## భూముల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 20,(విజన్ ఆంధ్ర);భూముల సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలో జరుగుతున్న భూముల సర్వేపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు పూర్తి చేసిన భూముల సర్వే, చేయాల్సిన సర్వే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రెవెన్యూ మ్యాపులు లేని గ్రామాల ఇబ్బందులు తొలగించేందుకు చేపట్టిన సర్వే ను గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులంతా క్షేత్ర స్థాయిలో సర్వేలో పాల్గొనడంతో పాటు, ఉన్నతాధికారులు సర్వే తీరును పర్యవేక్షించాలన్నారు. అధునాతన పరికరాల ద్వారా సర్వే నిర్వహణ సులభంగా, ఖచ్చితత్వంతో ఉంటుందని అన్నారు. ప్రణాళిక ప్రకారం సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. సర్వే నిర్వహణకు సంబంధించి నూతన ల్యాప్ టాప్ లను అధికారులకు కలెక్టర్ అందజేశారు. అంతకముందు కలెక్టర్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్ తో కలిసి ఆర్థిక అక్షరాస్యత అవగాహన, సహాయం, ఆర్థిక అక్షరాస్యత కేంద్రానికి సంబంధించిన గోడ ప్రతులను డీఈవో భోజన్న, డిపిఆర్వో విష్ణువర్ధన్, అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ దేవీదాస్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

హైదరాబాద్ ఆగస్టు 20 :: త్వరలో ప్రారంభం కానున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ఐఎస్ సదన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మాజీ పార్లమెంట్ సభ్యురాలు దివంగత సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ బిజెపి భాగ్యనగర్ జిల్లా మహిళ మోర్చా ఆధ్వర్యంలో సైదాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఇందిరా సేవా సదన్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎంతోమంది పేద విద్యా ర్థినీలకు విద్య, వసతి కల్పించిన సంగం లక్ష్మీబాయి జ్ఞాపకార్థం సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ఆమె నామక రణం చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఆమె సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకురాలిగా, విద్యావేత్తగా గుర్తింపు పొందారని, సైదాబాద్ ప్రాంతానికే గర్వకారణమన్నారు. లక్ష్మీబాయి సేవ లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి త్వరలో ప్రారం భించే సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్ర మంలో మహిళా మోర్చా నేతలు దశరథ లక్ష్మీ. రేణుక ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

## బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

**- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 విజన్ ఆంధ్ర : వనపర్తి జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీసు శాఖ ముఖ్య లక్ష్యమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాల్య వివాహాల నుంచి విముక్తి పొందిన 54 మంది బాలికలు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. “బాల్య వివాహం ఆపడం అంటే కేవలం ఒక పెళ్లిని నిలిపివేయడం కాదు, ఒక బాలిక చదువును, కలలను కాపాడటం. బాధితులకు ఒక అమ్మగా, అక్కగా తోడుండి తమ కాళ్లపై తాము నిలబడేలా చేస్తాం“ అని ఎస్పీ భరోసానిచ్చారు. పోలీసు బృందాలు సేకరించిన కుటుంబ స్థితిగతుల సమాచారం ఆధారంగా, బాలికలు కోరుకున్న వృత్తి కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ ఇప్పించి జీవనోపాధి కల్పిస్తామని ప్రకటించారు. చిన్న వయసులోనే వివాహం చేసుకోవడం వల్ల కలిగే శారీరక, మానసిక ఒత్తిడి, పోషకాహార లోపం మరియు ముందస్తు గర్భధారణ వల్ల కలిగే ప్రమాదాల గురించి వైద్యులు అవగాహన కల్పించారు. ‘చైల్డ్






మ్యారేజ్ ఫ్రీ భారత్’ పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. బాధితులకు శాలువాలతో సన్మానం చేసి ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ గిరిబాబు, డిసిఆర్బి డిఎస్పీ బాలాజీ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, ఎస్సైలు, షీ టీమ్స్, భరోసా, ఏహెచ్‌టీయూ సిబ్బంది మరియు వైద్యులు పాల్గొన్నారు.

## నిన్న నల్గొండ... ఇవాళ వరంగల్...
# కాంగ్రేస్ లో కల్లోలం

హైదరాబాద్, ఆగస్టు 20 : లంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశమయ్యాయి. అధికార కాంగ్రెస్‌లో అంతర్గత ముసలం రోజు రోజుకూ ముదురుతోంది. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తున్నారు. మొన్నటి వరకు మంత్రి పదవి కోసం ప్రయత్నించాడు. విఫలం కావడంతో తిరుగుబాట పట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా పరకాల జరిగిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలు మరోమారు చర్చనీయాంశమయ్యాయి. రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించాయి. ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయించాలని, ఆయనను ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఇవి తన మంత్రివర్గ సహచరురాలు కొండా సురేఖకు షాక్ ఇచ్చాయి. పరకాల సీటు తన కూతురుకు ఇప్పించాలని మంత్రి కంటున్న కలలు కల్లలయ్యాయి.ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా సురేఖకు, ఇతర ఎమ్మెల్యేలకు మధ్య సఖ్యత కొరవడింది. కొండాపై ఇటీవలే ఉమ్మడి జిల్లా నేతలు సీఎంకు, పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. కొండా మురళి అరాచకాలనూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పరకాల సభలో రేవంత్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కృషిని ప్రశంసించారు. ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన పనులను గుర్తు చేస్తూ, వచ్చే ఎన్నికల్లో కూడా ఆయననే గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఇది సాధారణ ప్రోత్సాహం కాకుండా, స్పష్టమైన రాజకీయ సంకేతం. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా, సీఎం స్థాయిలో ఇలా పేరు తీసుకుని మాట్లాడటం అరుదు. దీంతో పరకాల సీటుపై రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అధికార పార్టీలో బలమైన మద్దతు ఉన్నట్లు స్పష్టమైంది.మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి గత కొన్ని నెలలుగా తమ కుమార్తె సుష్మితను పరకాల నుంచి బరిలోకి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కుటుంబం పరకాలను తమ రాజకీయ కంచుకోటగా భావిస్తూ, సుష్మితను తదుపరి తరం నాయకురాలిగా నిలబెట్టాలని చూస్తున్నారు. గతంలో కూడా సురేఖ పరకాల నుంచి పోటీ చేసిన నేపథ్యం ఉంది. కానీ సీఎం నేరుగా ప్రస్తుత ఎమ్మెల్యే పేరు చెప్పి మద్దతు తెలపడంతో కొండా కుటుంబం ఆశలు ఆవిరయ్యాయి. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, సీఎం ఉమ్మడి వరంగల్ పర్యటనలో కొండా సురేఖ?మురళి దంపతులు హాజరు కాలేదు. మేడారం నుంచి పరకాల వరకు జరిగిన కార్యక్రమాల్లో వారు కనిపించకపోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సమతుల్యతను సూచిస్తోంది. సీఎం స్థానిక ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇస్తూ, కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలనే సందేశం ఇచ్చినట్లు కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి బలమైన స్థానిక నాయకుడిగా ఉన్నారు. ఆయనను కొనసాగించడం ద్వారా పార్టీలో స్థిరత్వం కాపాడుకోవాలని సీఎం భావించి ఉండవచ్చు. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. టిక్కెట్ పంపిణీ అధికారికంగా జరగాల్సి ఉంది. కొండా కుటుంబం ఇప్పుడు ఎలా స్పందిస్తుందో, సుష్మిత ఏమి చేస్తారో చూడాలి. పార్టీలోని ఇతర నాయకులు కూడా ఈ సంకేతాన్ని గమనిస్తూ ఉంటారు.మొత్తంగా చూస్తే పరకాల సభ ద్వారా కొండా కుటుంబం పెద్ద అండ కోల్పోయినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సురేఖ పనితీరుపై సీఎం అసంతృప్తిగా ఉన్నారు. ఆమెకే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తారా లేదా అన్న అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు ఆమెతోపాటు ఆమె కుటుంబానికి షాక్ ఇచ్చారు. సీఎం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

## ప్రజ్వల్ సంస్థ ఆధ్వర్యంలో పెస్టిసైడ్ డీలర్స్ కి అవగాహన



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు20(విజన్ ఆంధ్ర); రైతులందరూ పిచికారి సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ ఉదయ్ రాజ్ అన్నారు వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం లిపి యు మేనేజర్ గటిక మృదుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి పురుగు మందుల డీలర్లు కి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది.లి ఈ కార్యక్రమానికి లిమండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారి డాక్టర్ ఉదయ్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూలి..., రైతులు ఆరోగ్య సమస్యలు తలెత్తడానికి ముఖ్యమైన కారణం రైతులందరూ పంటలపై రసాయనిక పురుగుమందుల విచక్షణ రహితంగా పురుగుమందులు స్ప్రే చేయడం వలన పురుగుమందు అవశేషాలు శరీరంలోకి వెళ్లి అనారోగ్యానికి తలెత్తి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులు కూడా తలెత్తడానికి అవకాశాలుంటాయి అన్నారు ముఖ్యంగా అత్యంత విషపూరితమైన పురుగు మందుల వల్ల మనుషులకు క్యాన్సర్ కారక జన్యుపరమైన లోపాలు పునరుత్పత్తి కారకాలకు దారితీస్తాయి అందువల్ల రైతులందరూ పురుగుమందులు పిచికారి సమయంలో తప్పకుండా వ్యక్తిగత రక్షణ దుస్తులను (లిహాజులి)ధరించి పురుగు మందు పిచికారి చేయాలని అన్నారు. స్పిక్ కంపెనీ ఏరియా మేనేజర్:– సుభాన్ పాషా మాట్లాడుతూలి రైతులకు డీలర్లు పురుగుమందుల విషయములో తగు జాగ్రత్తలు చెప్పాలి తక్కువ సామాన్య గల విష ప్రభావాల గల పురుగు మందులను పంటలపై పిచికారి చేయాలని సలహాలు అందించాలని పురుగుమందులు కొనే సమయంలో తప్పకుండా కరపత్రాలను చదివి వాటికి సంబంధించిన వివరాలను రైతులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ సీ.ఈ.ఓ పెద్దపల్లి రామ్మూర్తి ఫర్టిలైజర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు కార్యదర్శి చౌద సుధాకర్ వ్యవసాయ విస్తరణ అధికారులు తేజశ్రీ , దీక్షిత్ కుమార్ , హరీష్ మరియు ఎం.ఐ.స్ ఆఫీసర్ అక్కల రమేష్ , మరియు పి యు మేనేజర్ ఆయేషా,వివిధ గ్రామాల పురుగుమందుల షాపు ల యాజమాన్యులు డీలర్లు బీసీఐ రైతులు క్షేత్ర సిబ్బంది వెంకన్న, స్కైలాబ్ బాబు, సుజాత, సీనియర్ సామాజిక కార్యకర్త యాకయ్య, రాజు,మౌనిక, కోమల,సతీష్ సరస్వతి, మమత,తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో పీసీ, పీఎన్‌డీటీ చట్టం అమలుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం



సంగారెడ్డి, ఆగస్టు :20(విజన్ ఆంధ్ర ) గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను అరికట్టడం, పీసీ, పీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. లలిత దేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైద్య నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని స్కానింగ్ కేంద్రాల పనితీరు, పీసీ పీఎన్‌డీటీ చట్టం అమలు, రికార్డుల నిర్వహణ, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, లింగ నిర్ధారణ నిషేధానికి సంబంధించిన నిబంధనల అమలుపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ కే. లలిత దేవి మాట్లాడుతూ, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం లేదా ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి స్కానింగ్ కేంద్రం పీసీ పీఎన్‌డీటీ చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా చట్టంపై అవగాహన పెంపొందించుకుని, ఎక్కడైనా లింగ నిర్ధారణకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మహిళా శిశు సంరక్షణ, బాలికల భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ నాగనిర్మల, డాక్టర్ ప్రవీణ్, డెమో, వనజారెడ్డి, డాక్టర్ రాజు గౌడ్, డాక్టర్ శైలజ, డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## మూడెత్తుల తండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు20(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండల కేంద్రంలోని మూడెత్తుల తండాలో తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మూడూ దేవరాజ్ నాయక్ , కంటెస్టెడ్ సర్పంచ్ మూడు యాకు నాయక్ పాల్గొని సేవాలాల్ మహారాజ్, తుల్జా భవాని, యాడి, శీతల భవాని దేవతలకు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడూ దేవరాజ్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సాంప్రదా యాలు, ఆచారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజన యువతీ యువకులు తమ కులదైవమైన సేవాలాల్ మహారాజ్తో పాటు మేరమ్మ యాడి, శీతల భవానిలను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ సంప్రదాయాలను కొనసాగించడం అభినందనీయమన్నారు మూడూ దేవరాజ్ నాయక్ నాయక్ మాట్లాడుతూ పర్వతగిరి మండలంలోని 33 గ్రామాలు, పలు తండాలు, గ్రామపంచాయతీలలో తీజ్ పండుగను గిరిజన యువతీ యువకులు అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాలతో నిర్వహిస్తున్నారని తెలిపారు. గిరిజన దేవతలను పూజిస్తూ పాడిపంటలు సమృద్ధిగా పండాలని, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని పెద్దలు అందించిన సందేశాన్ని నేటి తరం కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మూడెత్తుల తండా మహిళలు, ఆడపడుచులు, యువతీ యువకులు, మూడెత్తుల తండా. అధ్యక్షుడు మూడు యాకు నాయక్ జాటోత్ మంగమ్మ బోడ శ్రీనివాస్. మంగీలాల్ రాజేందర్. నరసింహ. వీరన్న అరుణ్ తరుణ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తండా పెద్దలు, తీజ్ ఉత్సవాల కమిటీ సభ్యులు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సృజనాత్మక కార్యశాల



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు20(విజన్ ఆంధ్ర); తెలంగాణ సారస్వత పరిషత్తు, శాంతా వసంతా ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులకు "సృజనాత్మక కార్యాశాల" కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలం లో తేది :20-08-2026, గురువారం రోజున సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యశాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్ అధ్యక్షత వహించారు. తెలంగాణ సారస్వత భవిష్యత్తు ఆధ్వర్యంలో ముద్రింపబడిన 'రచనా కళ' అనే పుస్తకాన్ని ప్రధానోపాధ్యాయులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని అన్నారు. మీ భవిష్యత్తు నిర్మాణానికి సృజనాత్మక అంశాలను నేర్చుకోవడం చాలా ఉపయోగపడుతుందని ఉద్బోధించారు. పాక రమేశ్ బాబు గారు మాట్లాడుతూ పాఠశాలలో 'అక్షర వాహిని' మాసపత్రిక ఆవిష్కరించుకోవడం మంచి పరిణామమని అన్నారు. గతంలో విద్యార్థులకు సృజనాత్మకత పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. అనంతరం కార్యక్రమ సమన్వయ కర్త, స్టేట్ రిసోర్స్ పర్సన్ డా. మడత భాస్కర్ గారు విద్యార్థులకు తెలుగు సాహిత్యములోని పలు ప్రక్రియలను వివరిస్తూ "లేఖ" ప్రక్రియ యొక్క ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులకు, "రచనా కళ" పుస్తకం తో పాటు, సర్టిఫికెట్ కూడా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, స్టాఫ్ సెక్రటరీ శానుం వెంకన్న , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మ్యాన్‌హోల్‌లో దిగబడిన స్కూల్ బస్సు..

# తృటిలో తప్పిన ముప్పు!



- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని సిఎంసి అధికారులు..
- ప్రమాదం తర్వాతే హుటాహుటిన మరమ్మతులు
- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా? అని స్థానికుల ఆగ్రహం
- స్కూల్ బస్సు డ్రైవర్ అప్రమత్తతపైనా అనుమానాలు
- నైపుణ్యం లేని డ్రైవర్లతో చిన్నారుల భద్రతకు ముప్పు
- తక్కువ జీతం కోసం అర్హతలేని డ్రైవర్లను నియమించొద్దని సూచనలు
- ప్రమాదాలు జరిగే వరకు అధికారులు మేల్కొనరా? అని నిలదీత



కుత్బుల్లాపూర్, ఆగస్టు 20: (విజన్ ఆంధ్ర); రహదారిపై ధ్వంసమైన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారి వాహనదారులకు ముప్పుగా పరిణమించినా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో ఓ స్కూల్ బస్సు టైరు మ్యాన్‌హోల్ గుంతలో దిగబడింది. బస్సులో విద్యార్థులు ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్-2, సంజీవయ్యనగర్, వాజ్‌పేయినగర్ కూడలి సమీపంలో చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. బోయినపల్లిలోని సెంట్ పీటర్స్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులను తీసుకెళ్తుండగా ధ్వంసమైన మ్యాన్‌హోల్ గుంతలో టైరు దిగబడినట్లు పేర్కొన్నారు.

**- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని సిఎంసి అధికారులు**

మ్యాన్‌హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా మారిందని స్థానికులు గత కొన్ని రోజులుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాన్ని నివారించాలని కోరినా జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన అనంతరం అధికారులు హుటాహుటిన స్పందించడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే సమస్యను పరిష్కరించి ఉంటే ప్రమాదమే జరిగేది కాదని అంటున్నారు.

**- డ్రైవర్ నిర్లక్ష్యంపైనా ఆరోపణలు**

మరోవైపు రహదారి పరిస్థితిని గమనించి స్కూల్ బస్సు డ్రైవర్ మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ధ్వంసమైన మ్యాన్‌హోల్ ఉన్న ప్రాంతంలో వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా వెళ్లాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వెళ్లడంతోనే బస్సు టైరు గుంతలో దిగబడిందని కొందరు ఆరోపిస్తున్నారు. అయితే ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం ఎంతమేరకు కారణమైందో అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.

**- విద్యార్థుల భద్రతపై రాజీ వద్దు**

స్కూల్ బస్సుల నిర్వహణలో యాజమాన్యాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. చిన్నారులను ప్రతిరోజూ పాఠశాలకు తీసుకెళ్లే డ్రైవర్ల నియామకంలో అనుభవం, నైపుణ్యం, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ సామర్థ్యాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని సూచిస్తున్నారు. తక్కువ జీతానికి డ్రైవర్ లభిస్తున్నాడనే కారణంతో నైపుణ్యం, అనుభవం లేని వారిని నియమించడం వల్ల విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.
నైపుణ్యం లేని డ్రైవర్లతో చిన్నారుల ప్రాణాలతో చెలగాటం వద్దు స్కూల్ బస్సు డ్రైవర్‌కు రహదారి పరిస్థితులను ముందుగానే అంచనా వేసే సామర్థ్యంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ నిర్ణయం తీసుకునే నైపుణ్యం ఉండాలని స్థానికులు పేర్కొన్నారు. డ్రైవర్ల నియామకంతో పాటు వారి పనితీరుపై యాజమాన్యాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు. ఒక్క చిన్న పొరపాటు అనేక మంది విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉన్నందున బస్సుల నిర్వహణ, డ్రైవర్ల ఎంపిక విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేస్తున్నారు.

**- ప్రమాదం జరిగిన తర్వాతే మరమ్మతులా?**

విద్యార్థులు, స్కూల్ బస్సులు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతంలోనే మ్యాన్‌హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా మారినా అధికారులు సకాలంలో స్పందించకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను గుర్తించి పరిష్కరించడం అధికారుల బాధ్యత అని గుర్తుచేస్తున్నారు. ధ్వంసమైన మ్యాన్‌హోల్‌ను తాత్కాలికంగా మూసివేయకుండా శాశ్వతంగా మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**- ఇకనైనా మేల్కొంటారా?**

"ఫిర్యాదులు వచ్చినప్పుడే స్పందించరా.. ప్రమాదం జరిగిన తర్వాతే మేల్కొంటారా?" అని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యత ఎవరిదో తేల్చాలని కోరుతున్నారు. పరిసర ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్స్, రహదారి గుంతలను గుర్తించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, చిన్నారులు ప్రయాణించే మార్గాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి కాకుండా.. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొనాలని స్థానికులు కోరుతున్నారు.

# పది పార్టీలు మారిన చరిత్ర నీది నువ్వా కాంగ్రెస్‌ను విమర్శించేది?

- సీఎం రేవంత్‌ను తిడుతుంటే వేదికపై చప్పట్లు కొట్టేది ఎవరు?
- కాంగ్రెస్ నీకు ఏం తక్కువ చేసింది?
- పార్టీని దెబ్బతీసేలా మాట్లాడితే ఊరుకునేది లేదు
- కొండా ఫ్యామిలీపై వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ డైరెక్ట్ ఎటాక్



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 20(విజన్ ఆంధ్ర); పది పార్టీలు మారిన చరిత్ర ఉన్న మీరు కాంగ్రెస్‌ను విమర్శించేదేంటి? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బహిరంగ వేదికపై అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే పక్కనే ఉండి చప్పట్లు కొట్టేది ఎవరు?' అంటూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ కొండా కుటుంబంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కొండా సురేఖ, కొండా మురళిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చినా పార్టీని, ముఖ్యమంత్రిని బహిరంగంగా విమర్శించడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. గురువారం ఎంజీఎం సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయూబ్ మాట్లాడారు. పది పార్టీలు మారిన చరిత్ర ఉన్న వారికి కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదని అయూబ్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కాంగ్రెస్ జెండాను మోసి, కేసులు, అవమానాలు ఎదుర్కొని పార్టీని కాపాడింది కింది స్థాయి కార్యకర్తలేనని చెప్పారు. అలాంటి కార్యకర్తలను పక్కన పెట్టి పార్టీలు మారిన వారికి పదవులు, అవకాశాలు కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' అంటూ పార్టీని వర్గీకరించడం సరికాదని, కష్టపడిన కార్యకర్తలకు కాకుండా ఆయారాం గయారాంలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

*- సీఎం రేవంత్‌ను తిడుతుంటే చప్పట్లు కొట్టేది ఎవరు?*

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బహిరంగ వేదికలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే అదే వేదికపై వరంగల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్ ఎలా కూర్చుంటారని అయూబ్ ప్రశ్నించారు. సీఎంను అవమానిస్తుంటే చూస్తూ చప్పట్లు కొట్టడం ఏం సంస్కృతని నిలదీశారు. ఇదేనా కాంగ్రెస్ పార్టీ పట్ల ఉన్న నిబద్ధత అని ప్రశ్నించారు. ప్రజల కోసం 24 గంటలు పనిచేస్తున్న ముఖ్యమంత్రిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. 'మేము ఐదుగురిని గెలిపించాం' అంటూ కొండా దంపతులు చెప్పుకోవడాన్ని అయూబ్ ఎద్దేవా చేశారు. 2018లో పరకాల నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన వారు 2023లోనూ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచి ఉంటే సత్తా ఉందని ఒప్పుకునేవాళ్లమన్నారు. సొంత నియోజకవర్గాన్ని వదిలి మరో చోటికి వెళ్లి గెలిచి, ఐదుగురిని గెలిపించామని చెప్పుకోవడం ఏం లాజిక్ అని ప్రశ్నించారు.

*- కాంగ్రెస్ నీకు ఏం తక్కువ చేసింది?*

కాంగ్రెస్ పార్టీ కొండా సురేఖకు అనేకసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా అవకాశం కల్పించిందని అయూబ్ గుర్తుచేశారు. కొండా మురళికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి గౌరవించిందన్నారు. ఇన్ని అవకాశాలు కల్పించిన పార్టీని, ముఖ్యమంత్రిని బహిరంగంగా విమర్శించడం ఏం పద్ధతని మండిపడ్డారు. పార్టీలో టికెట్ ఆశించడం తప్పు కాదని, అయితే అంతర్గత అంశాలను బహిరంగ వేదికలపైకి తీసుకువచ్చి పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడటం సరికాదన్నారు. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న వారిపై కాంగ్రెస్ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని అయూబ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో కష్టపడి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అండగా నిలవాలని కోరారు. కొండా కుటుంబంపై డీసీసీ అధ్యక్షుడు అయూబ్ చేసిన తాజా వ్యాఖ్యలతో వరంగల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

## క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలుచేపట్టాలి

- సింగరేణి నీటితో పంట భూములకు ముంపుకు గురికాకుండా ముందస్తు కార్యాచరణ
- వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల ప్రారంభం
- ప్రతి విద్యార్థి కనీస విద్యా ప్రమాణాలు సాధించేలా బోధన
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు-20(విజన్ ఆంధ్ర) : క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమగ్ర చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం మంథని ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన ఆయన కన్నాల గ్రామంలోని వ్యవసాయ భూములను, అడవి సోమనపల్లిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను, సోమనపల్లిలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మంథని మున్సిపల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. కన్నాల గ్రామంలో సింగరేణి నీటి కారణంగా వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుతం పెద్దస్థాయిలో ముంపు జరగలేదని తెలిపారు. భవిష్యత్తులో సింగరేణి నీటి వల్ల వ్యవసాయ భూములకు నష్టం కలగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రారంభించేలా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. పనుల పురోగతికి నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, పనులను పెండింగ్‌లో ఉంచవద్దని స్పష్టం చేశారు. సోమనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరును పరిశీలించిన కలెక్టర్.. పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి కనీస విద్యా ప్రమాణాలను సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. మంథని మున్సిపల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో పట్టణ పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన వాహనాలు, ఇతర సౌకర్యాల కోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. పాత సీసీ రోడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీల నిర్మాణం, అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, మౌలిక వసతుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గడ్డం వెంకటస్వామి (కాక) విగ్రహం ప్రారంభించిన మంతెన జగన్ మోహన్ రావు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 20,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాక ) కాంస్య విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంతెన జగన్ మోహన్ రావు గురువారం ప్రారంభించారు. ముందుగా (కాకా ) విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాలలు వేశారు. గత కొన్ని రోజుల నుండి మంతెన జగన్ మోహన్ రావు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి సమక్షంలో చేరుతున్నారని, వీరితోపాటు కొందరు కార్పొరేటర్లు సైతం జగన్ మోహన్ రావు తో టచ్ లో ఉన్నారనే వార్తలు వచ్చినప్పటికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాత్రం అదంతా వట్టి పుకార్లే అని కొట్టిపడేశారు. ఏ ఒక్క కార్పొరేటర్ వెళ్లడం లేదని అందరు నాతోనే ఉన్నారని ప్రెస్ మీట్లో తెలిపారు. అయినప్పటికి మాజీ మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మాజీ కౌన్సిలర్ ఆగల్ డ్యూటీ రాజు మరికొంత మంది జగన్ మోహన్ రావు సమక్షంలో నే ఉన్నారనేది నిరూపితమైంది.దీంతో బైపాస్ కింగ్ దే పై చేయి అయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.మంచిర్యాల లలో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోవడం ఖాయం అని ప్రజలు పేర్కొంటున్నారు.ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, మంతెన జగన్ మోహన్ రావు లతో ఎంతమంది కార్పొరేటర్ లు ఉంటారో చూడాలి మరి.. మంచిర్యాల నియోజకవర్గం లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గెలిచినప్పటినుడి బైపాస్ నాయకుడు ప్రజల్లో వివాదాస్పదంగా పేరుంది.. భాతికంగ దాడులు చేయించడం, దాడుల్లో గాయపడ్డవారిపైనే కేసులు నమోదు కావడం ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. మరి ఇప్పుడు రాజకీయాల్లోకి అడుగుపెడితే ప్రజలు ఏ మేరకు అందరిస్తారో చూడాలి...

# రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలి

**- పామాయిల్ తోటను పరిశీలించి, రైతు కంకణాల రామ్ రెడ్డి అభినందించిన వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్**



మానపాడు ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రస్తుత ఎల్ నీనో పరిస్థితులలో పంట మార్పిడిలో భాగంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని, ఆయిల్ పామ్ పంటలతో కూడా మంచి ఆదాయం సమకూరుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల కార్యదర్శి సురేంద్ర మోహన్ అన్నారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లాలో పర్యటించిన వ్యవసాయ శాఖ కార్యదర్శి మానోపాడ్ మండలం జల్లపూర్ గ్రామంలో రైతు కంకణాల రామ్ రెడ్డి 50 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన పామాయిల్ తోటను పరిశీలించి రైతును అభినందించారు. రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులను మిశ్రమంగా వాడుతూ తగినంత నీరు పెట్టడం వలన మంచి దిగుబడి వచ్చిందని రైతు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ రైతుకు 248 టన్నులు దిగుబడి రావడంతో రూ.58.03 లక్షలు లబ్ది పొందినట్లు తెలిపారు. బిందుసేద్యం, పామ్ మొక్కల పైన అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నాగన్న అనే రైతు ఎన్ఎఫ్ఎం ఎస్ ద్వారా రాయితీ పొందిన కంది పంటను పరిశీలించి రైతును అభినందించారు. అనంతరం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లిలో ఆయిల్ పామ్ నర్సరీ ని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్యదర్శి జోగుళాంబ గద్వాల జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధు మోహన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, జనరల్ మేనజర్ సుధాకర్ రెడ్డి, ఉద్యాన వ్యవసాయ అధికారులు, రాజశేఖర్, ఇమ్రాన్, మహేష్, కరుణశ్రీ, ఆయిల్ ఫెడ్ కంపెనీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాన కల్పించిన ఆర్ కే పి పోలీసులు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 20,(విజన్ ఆంధ్ర ) : కమ్యూనిటీ పోలిసింగ్ పై రామకృష్ణ పూర్ పోలీసులు స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మాట్లాడుతూ సైబర్నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మీ మొబైల్ ఫోన్ లకు ఫోన్ చేస్తూ మేము బ్యాంక్ నుండి ఫోన్ చేస్తున్నాము ఓటీపీ చెప్పండని అడిగితె పొరపాటున చేప్పవద్దని అన్నారు.ఓక వేల ఓటీపీ చెప్పినట్లయితే మీ అకౌంట్ లో ఉన్నాడబ్బులు కాజేస్తారని పేర్కొన్నారు. యువత గంజాయి లాంటి వాటికీ దూరంగా ఉండాలని, గంజాయి కొనుగోలు చేసిన విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఏవైనా అక్రమ వ్యాపారాలు చేస్తున్న పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఏ ఎస్ ఐ వెంకన్న అఖిల్, సురేష్, సతీష్ పాల్గొన్నారు.

## నారాయణపేటలో టిఎంయు ఆత్మీయ సమ్మేళనం

**- గజమాలతో ఘనంగా సత్కారం**



నారాయణపేట, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : నారాయణపేటలో ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం గురువారం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వథామారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు అయ్యారు. అంతకంటే ముందు ఆయనను తెలంగాణ మజ్దూర్ యూనియన్ నారాయణపేట నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చార్జి షిట్ లేని ఉద్యోగ భద్రత, సస్పెన్షన్, ఇంక్రిమెంట్ బ్యాక్ లేని ఉద్యోగ భద్రత కావాలంటే తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే ఈ ఆర్టీసీ ఎన్నికలు ఉద్యోగ భద్రతకు అత్యంత కీలకమని ఆయన అన్నారు. టి. ఎం. యూ ను అదరిస్తేనే సంపూర్ణ ఉద్యోగ భద్రత వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట డిపోలో టీఎంయూ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీఎంయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వహీద్, రాష్ట్ర కార్యదర్శి హైమద్ ఖాన్, రీజినల్ సెక్రెటరీ మధు, శ్రీలక్ష్మి, శ్రీదేవి, నఫీస్ ఖాతూన్, సందా నర్సింలు, నజీర్ ,రాజవర్ధన్ రెడ్డి, శ్రీధర్, మోహన్ రెడ్డి, ఎం ఎం రెడ్డి, పివిఆర్ రెడ్డి, శివ రాములు, వాకిటి శీను, కేడి గౌడ్, హనుమంతు, రాజేశ్వర్ తదితరులు అధిక సంఖ్యలో హాజరు అయ్యారు.


## ఇసుక సరఫరా ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 20,(విజన్ ఆంధ్ర ) : ఎస్.ఎస్.ఎం.ఎం.ఎస్. వెబ్ సైట్ ద్వారా చేపడుతున్న ఇసుక సరఫరా ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ లో గల వేలాల ఇసుక రీచ్ ని తహసిల్దార్ వనజ రెడ్డి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుకను పారదర్శకంగా, అధికారికంగా అందించేందుకు ఎస్.ఎస్.ఎం.ఎం.ఎస్. వెబ్ సైట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆన్ లైన్ లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు నిర్ణీత గడువులోగా సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షించాలని, ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారి 163 జి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు పనులను పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు....

**- చిత్రపటానికి పులమల మాల వెసి నివాళులర్పించి మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి**



వరంగల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20(విజన్ ఆంధ్ర); భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు పర్వతగిరి మండలం కొంకపాక గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఇస్లావత్ సావిత్రి ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీమతి ఇస్లావత్ సావిత్రి మాట్లాడుతూ... 40 ఏళ్ల వయస్సులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ టెలికాం, ఐటీ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వివరించారు. దేశంలో 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేశారని కొనియాడారు. నవోదయ విద్యాలయాల ద్వారా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన ఘనత ఆయనదేనని అన్నారు.దేశంలో శాంతి, మత సామరస్యం, సమగ్రతను కాపాడుకోవాలని, రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బొట్ల మహేంద్ర, జిల్లా ఎస్ సి సెల్ ఉప అధ్యక్షులు మసాని సుధాకర్, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు నరకుడు రవీందర్,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మసాని సువర్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాషా,యూత్ కాంగ్రెస్ నాయకులు బొక్కల ప్రమోద్, మరియు తధితర గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మసాలాల్లో కల్తీ దందా.. కోట్ల విలువైన సరుకు సీజ్!

- గడువు ముగిసిన సరుకుకు కొత్త ప్యాకింగ్.. కారం పొడిలో 30 శాతం చెక్క పొట్టు
- మల్కాజిగిరి ఎస్ఓటీ,పోలీసులు, మెరుపుదాడులు
- 1.50 కోట్ల విలువైన సరుకు, ముడిసరుకు,యంత్రాలను సీజ్
- విలేకరుల సమావేశంలో వెల్లడించిన మల్కాజిగిరి కమిషనర్ ఆఫ్ పోలీస్ బి.సుమతి





మేడ్చల్ జిల్లా/బోడుప్పల్,ఆగస్టు 20(విజన్ ఆంధ్ర) : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ సాగుతున్న కల్తీ మసాలా దందా గుట్టురట్టయింది. ఉప్పల్,మేడిపల్లి ప్రాంతాల్లో రెండు కేంద్రాలపై మల్కాజిగిరి ఎస్ఓటీ, పోలీసులు, ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ మెరుపుదాడులు నిర్వహించాయి. 11,220 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని, సుమారు రూ.1.50 కోట్ల విలువైన సరుకు, ముడిసరుకు,యంత్రాలను సీజ్ చేశారు. ఉప్పల్‌లో గడువు ముగిసిన మసాలాలను తిరిగి ప్రాసెస్ చేసి కొత్త ప్యాకెట్లలో నింపుతున్నట్లు గుర్తించగా.. మేడిపల్లిలో కారం పొడిలో ఏకంగా 30 శాతం చెక్క పొట్టు కలిపినట్లు అధికారులు గుర్తించారు. రెండు కేసుల్లో పలువురిని అదుపులోకి తీసుకున్నామని మల్కాజిగిరి కమిషనర్ ఆఫ్ పోలీస్ బి.సుమతి తెలిపారు.గురువారం ఉప్పల్ డిసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈసంధర్బంగా సిపీ మాట్లాడుతూ ఉప్పల్ పోలిస్ స్టేషన్ పరిధిలోని రామంతాపూర్ లక్ష్మీనారాయణ నగర్ ప్లాట్ నంబర్ 122లో ఉన్న వి. మెహక్ మసాలాస్‌లో గడువు ముగిసిన మసాలా ఉత్పత్తులను తిరిగి ప్రాసెస్ చేసి కొత్త ప్యాకెట్లలో ప్యాక్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రసిద్ధి రెడ్ చిల్లీ పౌడర్ 210 కిలోలు, ప్రసిద్ధి టర్మరిక్ పౌడర్ 60 కిలోలు, స్పైస్ మాస్టర్ కొరియాండర్ పౌడర్ 60 కిలోలు కలిపి 330 కిలోల గడువు ముగిసి వినియోగానికి పనికిరాని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.అదనంగా 400 కిలోల జీలకర్ర, 1,750 కిలోల పసుపు, 25 కిలోల ధనియాలు, 53 కిలోల 50 గ్రాముల ప్యాకెట్ల సామగ్రి, ఐదు తయారీ యంత్రాలను సీజ్ చేశారు. మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ సుమారు రూ.1.25 కోట్లుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ఈ కేసులో సూపర్‌వైజర్ దేవనాని భూపేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు,యజమాని కవితా నరేష్ దేవనాని దాడి సమయంలో అందుబాటులో లేకుండా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

మేడిపల్లిలో మరో కల్తీ కేంద్రం గుర్తింపు

మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఉన్న సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌పై ఎస్ఓటీ మల్కాజిగిరి,ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ దాడి చేసి ఇక్కడ పసుపు,కారం,ధనియాల పొడి, గరం మసాలాలను అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్నట్లు గుర్తించారు.స్వస్తిక్ బ్రాండ్ పేరుతో ప్యాకేజింగ్,లేబుల్స్ ఉపయోగిస్తున్నట్లు,కారం పొడిలో సుమారు 30 శాతం చెక్క పొట్టు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించామన్నారు.స్వదేశీ స్వస్తిక్ బ్రాండ్‌ను పోలిన నకిలీ ప్యాకేజింగ్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.ఈ దాడిలో 2,300 కిలోల పసుపు పొడి,3,350 కిలోల కారం పొడి,5,140 కిలోల ధనియాల పొడి,100 కిలోల గరం మసాలా కలిపి మొత్తం 10,890 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.25 లక్షలుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.ఈ కేసులో సత్యనారాయణ,రుద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని స్వాధీనం చేసుకున్న సామగ్రిని మేడిపల్లి పోలీసులకు అప్పగించామని తెలిపారు.ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో బ్రాండ్ పేరు,తయారీ తేదీ,గడువు తేదీ, బ్యాచ్ నంబర్,ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరాలు తదితరాలను పరిశీలించాలన్నారు. కల్తీ ఆహారంపై హెల్ప్‌లైన్: 8712662111 ద్వారా ఫిర్యాదులు చేయాలని పోలీసులు ప్రజలకు సూచించారు. ఈ ఆపరేషన్ మల్కాజిగిరి కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. సుమతి, ఐపీఎస్ పర్యవేక్షణలో డీసీపీలు కె. సురేష్‌కుమార్,కె.మనోహర్,ఏసీపీలు,ఇన్‌స్పెక్టర్లు,ఎస్ఓటీ సిబ్బంది, ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ పాల్గొన్నారు. ఆధ్వర్యంలో జరిగింది.

## కబ్జా చేయలేదు....జీపీఏ హోల్డర్ వద్దే కొనుగోలు చేశాం..

- **కాలనీ అసోసియేషన్‌కు గ్రామ పెద్దల సమక్షంలో లిఖితపూర్వకంగా ఇచ్చాం..**
- **కానీ మమ్ములను మానసికంగా వేధిస్తున్నారు**
- **మా కుటుంబానికి ఏదైనా జరిగితే నలుగురు వ్యక్తులదే బాధ్యత**
- **తిరుమల మేడోస్ కాలనీవాసులు మేడిశెట్టి వెంకట్, శ్రీనివాస్ గుప్తా**



బోడుప్పల్,ఆగస్ట్20( విజన్ ఆంధ్ర) : తాము జీపీఏ హోల్డర్ వద్ద చట్టబద్ధంగా స్థలం కొనుగోలు చేశామని, ఎలాంటి కబ్జాకు పాల్పడలేదని మేడిశెట్టి వెంకట్, శ్రీనివాస్ గుప్తా తెలిపారు. తిరుమల మెడోస్ కాలనీలోని స్థల వివాదంపై వారు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాము స్థలాన్ని జీపీఏ హోల్డర్ వద్ద కొనుగోలు చేశామని, తమకు ఎలాంటి అక్రమ కబ్జాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై కాలనీవాసులతో నెలకొన్న వివాదానికి పరిష్కారం కోసం గ్రామ పెద్దల సమక్షంలో కాలనీ అసోసియేషన్‌కు ఈ నెల 6న లిఖితపూర్వకంగా హామీ ఇచ్చామని తెలిపారు.తమకు సంబంధం లేని మిగతా ఫ్లాట్లలో కూడా మాకు సంబంధం ఉందని కొందరు కాలనీవాసులు వెంకటస్వామి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, తమను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు.తమకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతూ తమ కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని,ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు.మేము చట్టబద్ధంగా కొనుగోలు చేశాం.కబ్జా చేయలేదు. సమస్యను పరిష్కరించేందుకు గ్రామ పెద్దల సమక్షంలో 300 గజాల స్థలాన్ని కాలనీ అసోసియేషన్‌కు ఇచ్చేందుకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చామని తెలిపారు. అయినా మాపై ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధిస్తున్నారని వారు పేర్కొన్నారు.తమ కుటుంబానికి ఏదైనా జరిగితే నలుగురు వ్యక్తులదే బాధ్యత అని వారు ఆరోపించారు.కాలనిలో ఎన్నో లేఅవుట్లు ఉన్నాయని ఏది నిజమైన లేఅవుటు అని సర్కిల్ అధికారులు విచారణ జరపి తెల్చాలన్నారు.

## బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ ఎన్నిక..



సూర్యాపేట ఆగస్టు 20:(విజన్ ఆంధ్ర) : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా సూర్యాపేట జిల్లా నూతన కమిటీని గురువారం జిల్లా అధ్యక్షుడు బొజ్జ పరశు రాం ప్రకటించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నారప రాజు రామచందర్ ఆదేశాల మేరకు బిజెపి పార్టీ సూర్యపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్, జిల్లా ఇన్చార్జి తూట్ పల్లి రవి, ఎస్సీ మోర్చా జిల్లా ఇన్చార్జి అంకురి నరసింహ ఆదేశాల మేరకు ఈ నియామకాలు ప్రకటించారు. ఉపాధ్యక్షులు పిడిమర్తి అనిల్, చిత్రాల సురేందర్, మేకల ఇమాన్యుల్, అల్లే రాములు, బొజ్జ రోహిత్ ప్రధాన కార్యదర్శులుగా వల్లపట్ల మహేష్, బొల్లేపొంగు కాశయ్య, కంపాటి రాజు కార్యదర్శులుగా ఏర్పుల సాయి, వల్దాస్ చరణ్, విడతల శంకర్, కడారి ఎల్లయ్య, కొంపల్లి గణేష్, కోశాధికారిగా ఎరకచర్ల సన్నీ, అధికార ప్రతినిధిగా చాగంటి మురారి, సామాజిక మాధ్యమాల బాధ్యుడిగా తుమ్మలపల్లి వెంకటేష్, సాంకేతిక విభాగ ఇన్చార్జిగా బొజ్జ ప్రేమ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా నెవెలి లింగయ్య, పిడమర్తి సౌజన్య, కాంపాటి వెంకటేశ్వర్లు, పొరపాటు విమల, ఉప్పల రామచందర్, కొండేటి జయమ్మ, గణేష్ ఈ ఎస్ఎంహెచ్ కమిటీలో నియమించారు.

# విద్యా వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 20,(విజన్ ఆంధ్ర ) : విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే చర్యలలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని తెలిపారు. అదనంగా నిర్మిస్తున్న గదులు, భోజనశాల పనులను త్వరగా పూర్తి చేయాలని, వంటశాలలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పోషకాహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, విద్యార్థుల గైర్హాజరును ప్రతిరోజు పర్యవేక్షిస్తూ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని పల్లంగూడ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం, నూతనంగా నిర్మిస్తున్న వి.ఓ. భవనాల పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామంలోని డంప్ కంపోస్ట్ పిట్ ను పరిశీలించి, వ్యర్థాల నిర్వహణను సమర్ధవంతంగా చేపట్టాలని సూచించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న శాశ్వత కూరగాయల పందిరి సాగును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాళ్లపల్లి మౌనిక యూనిట్‌లో చేపట్టిన ఈ సాగుకు యూనిట్ వ్యయం 2 లక్షల 50 వేల రూపాయలు కాగా ఉద్యానవన శాఖ ద్వారా 1 లక్ష రూపాయల రాయితీ అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఇలాంటి ఆధునిక సాగు పద్ధతులను వినియోగించుకుని అదనపు ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె దవాఖాన/ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు, బోధన విధానంపై వివరాలు తెలుసుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. మండలంలోని రేకులగూడలో గల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న గదులు, వంటశాలను పరిశీలించి నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోమండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్తర్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐపిసి ఉద్యోగాల ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 20,(విజన్ ఆంధ్ర ) : రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం అందిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, బెల్లంపల్లి ఆర్.ఐ. సంపత్ లతో కలిసి ఉచిత శిక్షణ సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని, 90 రోజుల పాటు నిర్వహించే ఈ ఉచిత శిక్షణలో అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించడంతో పాటు, ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హైదరాబాద్‌కు చెందిన నిపుణులైన ఫ్యాకల్టీ ద్వారా ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఎస్ఐపిసి ఎంపిక ప్రక్రియలో కీలకమైన ఈవెంట్స్‌కు సంబంధించి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. అర్థమెటిక్ & రీజనింగ్ సబ్జెక్టు కొరకు వరంగల్ లోని లెజెండ్ ఇన్స్టిట్యూట్ నుండి ఎం.రాధాకృష్ణ, కాకినాడలోని శ్యామ్ ఇన్స్టిట్యూట్ నుండి యాకయ్య, కరీంనగర్ లోని కెఎన్ఆర్ ఇన్స్టిట్యూట్ నుండి గోపి, హైదరాబాద్ లోని యూనిక్ ఇన్స్టిట్యూట్ నుండి జి. రమేష్, బి.ఐ.పి. ఇన్స్టిట్యూట్ నుండి నాగరాజు, జనరల్ స్టడీస్ & కరెంట్ అఫైర్స్ సబ్జెక్టు కొరకు ఆర్.సి. రెడ్డి ఇన్స్టిట్యూట్ నుండి సైదులు, తెలంగాణ హిస్టరీ సబ్జెక్టు కొరకు జయశంకర్ ఇన్స్టిట్యూట్ నుండి రవీందర్, జియోగ్రఫీ సబ్జెక్టు కొరకు హైదరాబాద్ లోని యూనిక్ ఇన్స్టిట్యూట్ నుండి వెంకట్ రెడ్డి, పాలిటి సబ్జెక్టు కొరకు హైదరాబాద్ లోని శ్రీ షైన్ ఇన్స్టిట్యూట్ నుండి శ్రీనివాస్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల కొరకు హైదరాబాద్ లోని హెచ్.ఐ.పి. ఇన్స్టిట్యూట్ నుండి రాజు లను ఫ్యాకల్టీగా నియమించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుండి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఈ నెల 31వ తేదీన తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. 8712538278, 9490906773 నెంబర్ల ద్వారా అభ్యర్థులు తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని, వాట్సాప్ ద్వారా సైతం వివరాల నమోదు జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి

**- పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ను శక్తి పాలసీలో కలపడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి**

**- బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ నిరసన ర్యాలీ.**






గద్వాల ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ను శక్తి పాలసీలో విలీనం చేయకుండా తక్షణమే శక్తి పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ,రాష్ట్ర పిలుపు మేరకు బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. నాలుగు గంటలపాటు కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేయడం జరిగింది. అనంతరం అడిషనల్ కలెక్టర్ కి, ఏవో గార్లకు వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్వి నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి స్కీమ్, జీవో-97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్వి ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని అన్నారు ఇంజనీర్లు కావలసిన విద్యార్థులను లేబర్ డిపార్ట్మెంట్లోకి తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో మోసం చేస్తూ పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ను శక్తి పాలసీలోకి కలపడం చేయడం తీవ్రమైన అన్యాయమని అన్నారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించలేకనే ఈ యొక్క పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ ను ఎత్తివేసే కుట్రలో భాగమే ఈ శక్తి పాలసీలో కలపడం అని అన్నారు.భవిష్యత్తులో పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ విద్యార్థులు ఘోరంగా నష్టపోయే పరిస్థితి ఉన్నది ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ అనాలోచిత నిర్ణయాన్ని వెనుక తీసుకోవాలి శక్తి పాలసీని జీవో నెంబర్ 97 రద్దు చేయాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున ఇంకా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కిషోర్, భాను ప్రకాష్, ప్రణీత్ అఫ్రోజ్, హరీఫ్, సాత్విక్, నవీన్ రమేష్ శివాని లలిత, సిద్ధార్థ, భార్గవ్, అనస్, ఇర్ఫాన్, తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ యువతకు రాజీవ్ ఒక స్ఫూర్తి..



సూర్యాపేట ఆగస్టు 20:(విజన్ ఆంధ్ర) : దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదే అని డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ వైస్ చైర్మన్ యం.డి. షఫీ ఉల్లా అన్నారు. గురువారం జిల్లా కేంద్రం రాజీవ్ గాంధీ ఫార్క్ లో స్వర్గీయ మాజీ ప్రధాని,భారత రత్న, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో జమ్మిగడ్డలో రాజీవ్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు. దేశ సమగ్రత కోసం, సమైక్యత కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబం. ఆయన జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను, ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వారి స్ఫూర్తితో మళ్లీ దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం" అని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు భవిష్యత్తులో రాజకీయంగా, సామాజికంగా ఉన్నత పదవుల్లో అవకాశాలు వస్తాయన్నారు.ప్రతి ఒక్కరు రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు నాగుల వాసు, చిలుముల సునీల్ రెడ్డి, తన్వీర్ హుసేన్, ఎస్ కె జహీర్, ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కరుణా రెడ్డి, వీరన్న నాయక్, పారూక్, పోలగాని బాలు గౌడ్, కమ్మరికుంట్ల లింగయ్య, కోడి శివ, బండారు వెంకన్న, గడ్డం వెంకన్న, సాజిద్, అక్కినపల్లి జానయ్య, రుద్రంగి రవి, పడిదల రవి తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుతో బాధిత పిల్లలకు భరోసా కల్పించాలి



సూర్యాపేట ఆగస్టు 20:(విజన్ ఆంధ్ర) : ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన దంపతుల హత్య ఘటనలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు,భూక్య రాజు నాయక్ డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మోతే మండలంలో ఎస్టీ దంపతులు దారుణ హత్యకు గురికావడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేయడంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ స్పందించిన తీరు అభినందనీయమన్నారు. అయితే బాధితులు ఎస్టీ సామాజిక వర్గానికి చెందినందున ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసు నమోదు చేయాలని కోరారు. అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయడం ద్వారా బాధిత దంపతుల పిల్లలకు చట్టపరమైన భరోసా, ఆర్థిక సహాయం అందే అవకాశం ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల భవిష్యత్తును ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి వారి కుటుంబానికి జీవనాధారం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి తగిన పరిహారం, పిల్లలకు విద్యా సదుపాయాలు కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు లంబాడి హక్కుల పోరాట సమితి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**- మహిళా సంఘాల సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు**

**- బోయినపల్లి పీహెచ్సీలో స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**





బోయినపల్లి రాజన్న సిరిసిల్ల జిల్లా , ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో): మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందించేందుకు 30 రకాల ఆరోగ్య పరీక్షలతో ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సంఘాల సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని గురువారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలు కేవలం రుణాలు పొందడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకే పరిమితం కాకుండా మహిళల గుర్తింపు, సంక్షేమం, సాధికారతతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో మహిళలు తరచూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటుందని, అందువల్ల ప్రతి మహిళ తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. రక్తహీనతతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఈ స్క్రీనింగ్ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ-ఆరోగ్యం యాప్ ద్వారా పరీక్షల ప్రక్రియను నిర్వహిస్తున్నామని, పరీక్షల ఫలితాలను మహిళల మొబైల్ ఫోన్లకు మెసేజ్ ద్వారా పంపిస్తామని చెప్పారు. రిపోర్టులను వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలని, చికిత్స అవసరమైతే ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని సూచించారు.

***– ఐదు మండలాల్లో దశలవారీగా పరీక్షలు***

మొదటి దశలో బోయినపల్లి, వేములవాడ, వీర్నపల్లి, కోనరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లో మహిళా సంఘాల సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బోయినపల్లిలో కార్యక్రమాన్ని ప్రారంభించగా, మిగతా నాలుగు మండలాల్లో శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. బోయినపల్లి మండలంలోని 31 విలేజ్ ఆర్గనైజేషన్ల పరిధిలో 819 స్వయం సహాయక సంఘాల్లో 9,424 మంది సభ్యులు ఉన్నారని, వారందరికీ దశలవారీగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ 50 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని, మహిళా సంఘాల సమావేశాల కోసం గ్రామైక్య సంఘాల భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సమూహాలుగా ఏర్పడి వ్యాపారాలు, కొత్త యూనిట్లు స్థాపించేందుకు ఆసక్తి ఉన్న మహిళలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఏంజెలా అల్ఫ్రెడ్, సర్పంచ్ మోహన్, మండల ప్రత్యేక అధికారి శరత్, తహసీల్దార్ షరీఫుద్దీన్, వైద్యులు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంహెచ్ఏ పోర్టల్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**- సైబర్ క్రైమ్ అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్**

**- స్పార్క్ క్లబ్ ద్వారా విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన**



కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 21(విజన్ ఆంధ్ర) : మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ (ఎంహెచ్ఏ) ఆధ్వర్యంలోని ఎంఆర్ఎమ్, జిఆర్ఎమ్, సమన్వయ, సహయోగ్ వంటి ఆధునిక పోర్టల్స్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ ఉత్తమ పనితీరు కనబరిచిన తెలంగాణ పోలీస్ యూనిట్లలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. ఎంహెచ్ఏ పోర్టల్స్‌లో నమోదైన పనితీరు ఆధారంగా ప్రకటించిన ఉత్తమ ప్రదర్శన జాబితాలో సమన్వయ కేటగిరీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ బాధితులకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు.

***– స్పార్క్ క్లబ్ ద్వారా విద్యార్థులకు అవగాహన***

సైబర్ నేరాలపై యువతలో అవగాహన పెంపొందించేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో స్పార్క్ క్లబ్ ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాల ద్వారా సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ అరెస్టులు తదితర సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పించడంలో చురుకుగా పాల్గొంటున్న విద్యార్థులను ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరాల నియంత్రణలో పోలీసుల చర్యలతో పాటు ముఖ్యంగా యువతలో అవగాహన ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు సైబర్ అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ఎంహెచ్ఏ పోర్టల్స్‌లో జిల్లాకు లభించిన రాష్ట్రస్థాయి గుర్తింపు పోలీసు అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని ఎస్పీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో సైబర్ నేరాల నియంత్రణకు మరింత సమర్థవంతంగా పనిచేయాలని అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్సై జుబేదా బేగం, సైబర్ సెల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నగరంలో ఏడబ్ల్యూఎస్ బిల్డర్ లాఫ్ట్ కార్యక్రమం




హైదరాబాద్, ఆగస్ట్ 20 (విజన్ ఆంధ్ర) : డెవలపర్లు, విద్యార్థులు, టెక్ నిపుణుల కోసం ఏడబ్ల్యూఎస్ బెర్లిన్, హైదరాబాద్, సావో పాలోలో కొత్త ఏడబ్ల్యూఎస్ బిల్డర్ లాఫ్ట్స్ ను ప్రారంభించనున్నట్లు ఏడబ్ల్యూఎస్ డెవలపర్ ఎక్స్‌పీరియన్స్ డైరెక్టర్ డేవిడ్ నాలీ గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ బిల్డర్లు కలిసి ప్రాజెక్టులు నిర్మించుకుని, పరస్పరం నేర్చుకునే వేదికలుగా ఇవి నిలుస్తాయని తెలిపారు. ఇక్కడ ఉచిత వర్క్‌షాప్‌లు, హ్యాకథాన్‌లు, పిచ్ నైట్స్, నెట్‌వర్కింగ్, కో-వర్కింగ్ సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. బెర్లిన్‌లో డిజిటల్ సార్వభౌమత్వం, సెక్యూరిటీపై కార్యక్రమాలు, హైదరాబాద్‌లో ఏఐ, క్లౌడ్-నేటివ్ టెక్నాలజీలపై శిక్షణ; సావో పాలోలో డెవలపర్లు, యూనివర్సిటీలు, స్టార్టప్‌లకు ఉచిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

# పాత పెన్షన్ విధానం ఉద్యోగుల జీవిత చరమాంకంలో ఆర్థిక భరోసాను కల్పిస్తుంది

**- ఆగస్టు 23 చలో హైదరాబాద్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ**

**- అయిజ తహసిల్దార్ జ్యోతి**



అయిజ ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్సీపిఎస్ఈయు) అయిజ మండల శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభ పోస్టర్లను స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎన్. జ్యోతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జ్యోతి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు 3040 సంవత్సరాల పాటు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నారని అన్నారు. అయితే పదవీ విరమణ అనంతరం సిపిఎస్.విధానం కారణంగా ఉద్యోగులకు తగిన ఆర్థిక భరోసా లేకుండా పోతోందని పేర్కొన్నారు. ఉద్యోగి జీవిత చరమాంకంలో ఆర్థిక భద్రత కల్పించేది పాత పెన్షన్ విధానమేనని, ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) అమలు చేయాలని కోరారు. గురువారం అయిజ పిఎం శ్రీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ మీటింగులోను , ఐజ పురపాలక కార్యాలయం నందు, ఎంపీడీవో కార్యాలయం నందు ఆగస్టు 23 కార్యక్రమం క్యాంపెనింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, గత 22 ఏళ్లుగా సీపిఎస్.ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రమైన సామాజిక, ఆర్థిక అభద్రతతో జీవిస్తున్నారని అన్నారు. సిపిఎస్. విధానంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వారికి లభిస్తున్న పెన్షన్ సరిపడా లేదని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేస్తున్న మొత్తంతో పాటు ప్రభుత్వం చెల్లించే వాటా కూడా మార్కెట్ ఆధారిత పెన్షన్ విధానంలో ఉండటంతో ఉద్యోగుల భవిష్యత్‌పై అనిశ్చితి నెలకొంటోందని నాయకులు తెలిపారు. ఇటీవలి అంతర్జాతీయ పరిణామాలు, మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావంతో ఉద్యోగుల పెన్షన్ నిధుల విలువలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్. విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సుమారు 2.6 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రత కోసం ఆగస్టు 23న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జోగులాంబ గద్వాల జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీవో మనోహర్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు , అయిజ మండల విద్యాధికారి రాములు దయాల్,సిపియస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు బుచ్చన్న, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పాల్వాయి లక్ష్మీనారాయణ, అయిజ మండల అధ్యక్షులు వీరేష్, పంచాయతీ సెక్రెటరీ జిల్లా అధ్యక్షులు రాధాగోపాల్, ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి, ప్రకాష్, లక్ష్మణ్ తదితర వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ కు బాసు హనుమంతు నాయుడు విరాళం



గద్వాల ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బాసు హనుమంతు నాయుడు స్వగృహం నందు గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ కు గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు 20,116/- రూపాయల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.


# తెలంగాణలో వ్యాపార విస్తరణకు గణనీయమైన అవకాశాలు

**- ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిష్ బంకర్**

హైదరాబాద్, ఆగస్ట్ 20 (విజన్ ఆంధ్ర) : తెలంగాణలో వ్యాపార విస్తరణకు గణనీయమైన అవకాశాలున్నాయని ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిష్ బంకర్ గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టర్మ్ ప్లాన్(రిటైల్ ప్రొటెక్షన్) వ్యాపారంలో 60.7 శాతం వార్షిక వృద్ధి సాధించినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ 206 మార్చి 31 నాటికి రాష్ట్రంలో 6,56,032 మందికి కవరేజీ అందించగా, నిర్వహణలోని ఆస్తులు రూ.11,708 కోట్లు, సమ్ అష్యూర్డ్ రూ.1,52,016 కోట్లుగా నమోదైనట్లు చెప్పారు. గత ఏడేళ్లలో తెలంగాణలో రూ.4,060 కోట్ల ప్రయోజనాలను, రూ.1,192 కోట్ల డెత్ క్లెయిమ్‌లను చెల్లించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కంపెనీకి 11 సొంత బ్రాంచీలు, 3,934 పార్టనర్ బ్రాంచీలు, 3,372 స్పెసిఫైడ్ పర్సన్స్, 6,172 అడ్వైజర్లు ఉన్నారు. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 99.3 శాతం క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో సాధించగా, విచారణ అవసరం లేని వ్యక్తిగత క్లెయిమ్‌లను సగటున ఒక రోజులో పరిష్కరించినట్లు తెలిపారు. కస్టమర్ సేవల్లో ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, డిజిటలైజేషన్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రూ పార్టనర్ స్టాక్, ఐ.పి.ఆర్.యు ఎడ్జ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఏజెంట్లు, భాగస్వాములకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కంపెనీ పేరును ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ గా మార్చేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. తెలంగాణలో వ్యాపార విస్తరణకు గణనీయమైన అవకాశాలున్నాయని తెలిపారు. బ్రాంచీల విస్తరణ, అడ్వైజర్ల నియామకం, కస్టమర్ అవగాహన కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.

# నాన్ మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**






అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20,(విజన్ ఆంధ్ర) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు వెంటనే జారీ చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య లతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా తహసిల్దార్లు, సూపర్వైజర్లతో నాన్ మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు, అనుమలిస్ జాబితాలో గల ఓటర్ల వ్యత్యాసాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లు జిల్లాలో 20 వేల 929 మంది ఉన్నారని, వారందరికీ నిర్ణీత గడువులోగా నోటీసులు అందించి వారి నుండి ఎన్నికల సంఘం పేర్కొన్న ఆధారాలను స్వీకరించాలని తెలిపారు. నోటీసులను ముందుగానే అందించి కొంత గడువు ఇవ్వాలని, అక్టోబర్ 5వ తేదీలోగా నాన్ మ్యాపింగ్ ఓటర్ల హియరింగ్ పూర్తి చేయాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లలో పేరు, తండ్రి పేరు, వయసు వంటి వ్యత్యాసాలను బూత్ స్థాయి అధికారుల లాగిన్, తహసిల్దార్ లాగిన్ లలో విచారించి చిన్నచిన్న వ్యత్యాసాలను సవరించవచ్చని, తద్వారా అనమలిస్ జాబితాలో గల ఓటర్లను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాలను వెంటనే చేపట్టాలని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సూపర్వైజర్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో బాలికలకు హెచ్. పి.వి. వ్యాక్సినేషన్ - విజయవంతంగా పూర్తి



భూపాలపల్లి జిల్లా :20 ఆగస్టు ( విజన్ ఆంధ్ర ) గురువారం రోజున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, భూపాలపల్లి-2 పీహెచ్ వైద్య బృందం ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాలు నిండిన బాలికల కోసం హెచ్. పి వి. వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం బాలికల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఒక కీలక అడుగు. ఈ సందర్భంగా, డా. కే. స్వాతి, మ్మెలహ్ప్ ఆధ్వర్యంలోని వైద్య బృందం బాలికలకు హెవ్ హెచ్. పి. వి వ్యాక్సిన్ యొక్క ప్రాముఖ్యత, దాని ప్రయోజనాలు, మరియు ముందస్తుగా వ్యాక్సినేషన్ తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై సమగ్ర అవగాహన కల్పించారు. గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హ్పూ వ్యాక్సిన్ యొక్క పాత్రను వారు స్పష్టంగా వివరించారు. అనంతరం, అర్హత కలిగిన బాలికలకు హ్పూ టీకాలు అందించబడ్డాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. నాంచారయ్య గారు క్యాన్సర్ వ్యాక్సిన్ గురించి ప్రసంగించారు, దీని ప్రాధాన్యతను చెప్పారు.బాలికల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వం సూచించిన ఆరోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో శ్రీదేవి, వి. మనన్య మరియు ఆశా వర్కర్ పి. కుమారి కీలక పాత్ర పోషించారు, బాలికలకు అవసరమైన సహకారాన్ని అందించి, టీకా ప్రక్రియను విజవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ డి. నాంచారయ్య, సీనియర్ ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్, మరియు 8, 9 తరగతుల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుడు గోపి కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర డిమాండ్



భూపాలపల్లి జిల్లా :20 అగస్ట్ (విజన్ ఆంధ్ర ) : భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని 1 ఇంక్లైన్ మైన్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు గోపాల గోపి మైన్‌లో ఊపిరాడక మృతి చెందడంతో విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సింగరేణి ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలో గోపి కుటుంబ సభ్యులను,ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న కార్మికులను పరామర్శించి వారికి మద్దతు తెలిపారు. అనంతరం సింగరేణి అధికారులతో మాట్లాడి కార్మికుల సమస్యలను, వారి డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మైన్‌లో ప్రమాదం జరిగినా, ఇతర కారణాలతో కార్మికులకు ఏదైనా అనారోగ్య సమస్య లేదా ప్రమాదం ఎదురైనా వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక అంబులెన్స్, అందులో అవసరమైన ఫస్ట్ ఎయిడ్ పరికరాలు, ఒక డాక్టర్, ఇద్దరు టెక్నీషియన్లను అందుబాటులో ఉంచాలని సింగరేణి అధికారులను డిమాండ్ చేశారు. అలాగే మృతి చెందిన కార్మికుడు గోపి కుటుంబాన్ని సింగరేణి యాజమాన్యం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబంలోని ఒకరికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు డిమాండ్ చేశారు. అనంతరం గోపి పార్థివ దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సన్న బియ్యం పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి

**- బోయినపల్లి చౌకధరల దుకాణంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ**



బోయినపల్లి రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో): రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు సన్న బియ్యాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని చౌకధరల దుకాణాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం నిల్వలు, ఇప్పటివరకు లబ్ధిదారులకు పంపిణీ చేసిన బియ్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియపై అధికారులను ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంతమంది లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారనే వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో, పారదర్శకంగా చేరేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. తనిఖీ సమయంలో తహసీల్దార్ షరీఫుద్దీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి

**- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఇంకా పెరగాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : విద్యార్థుల వికాసానికి చదువు దోహదపడాలంటే పిల్లల మానసిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ బోధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో కలెక్టర్ పాల్గొని ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఎఫ్ఎల్ ఎన్ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, విద్యకు సంబంధించిన వివిధ అంశాలపై ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరిగేలా ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులను ప్రయోగపూర్వకంగా బోధనోపకరణాలను తయారుచేసి, ఏఐ వంటి సాంకేతికతను వినియోగించి బోధించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థుల ప్రవర్తన, పాఠ్యాంశాలను అర్థం చేసుకునే తీరు గమనిస్తూ ఉండాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చదువులో వారు రాణించేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఇంకా పెరగాలని, యుడైస్ లో విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పోషణ్ యాప్ లో నమోదు చేసే వివరాలు పక్కాగా ఉండాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరిగా పేర్కొన్నారు. అవసరమైన పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించామని, అన్ని విద్యాసంస్థల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యాశాఖ కార్యకలాపాలన్నీ పకడ్బందీగా జరిగేందుకు ఉపాధ్యాయులు అందరూ తమ వంతుగా సహకరించాలని, వివిధ విద్యాంశాల్లో జిల్లా ర్యాంక్ మెరుగుపడేలా తోడ్పడాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర పరిశీలకులు అభిషేక్, డిఈఓ విజయలక్ష్మి, గద్వాల ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు విష్ణు, సిఆర్పి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# లంగ్స్ పై నిర్లక్ష్యం వద్దు..!




సూర్యాపేట ఆగస్టు 20:(విజన్ ఆంధ్ర) : ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ప్రమాదకరమనే అపోహను ప్రజలు వీడాలని యశోద ఆసుపత్రి సోమాజిగూడ శాఖకు చెందిన థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్ వారు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థొరాసిక్ సర్జరీ అంటే కేవలం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స కాదని, గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలను కార్డియో థొరాసిక్ సర్జరీగా పిలుస్తారని తెలిపారు. ఊపిరితిత్తులు, ఛాతీ భాగానికి సంబంధించిన శస్త్రచికిత్సలకు ప్రత్యేకంగా థొరాసిక్ సర్జరీ అనే విభాగం ఉందన్నారు. ముఖ్యంగా కొవిడ్ తర్వాత ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు.ఊపిరితిత్తులకు సంబంధించిన అనేక సమస్యలకు ప్రస్తుతం ప్రత్యేక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యశోద ఆసుపత్రి సోమాజిగూడలో పల్మనాలజీ, థొరాసిక్ సర్జరీ సేవలను 24 గంటలూ అందిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్‌ప్లాంట్) సేవలను కూడా ప్రారంభించామని, ఇప్పటికే విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించి పలువురు రోగులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు.ఎండ్ స్టేజ్ లంగ్ డిసీజ్‌తో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి కొత్త జీవితాన్ని అందించే అవకాశముందని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజెస్, ధూమపానం కారణంగా వచ్చే సీఓపీడీ వంటి వ్యాధుల్లో ఒక దశ తర్వాత ఊపిరితిత్తుల పనితీరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాంటి రోగులు శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతూ, ఆయాసంతో జీవన్మరణ పరిస్థితిని ఎదుర్కొంటారని, వారికి లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.క్షయ వ్యాధి కారణంగా ఊపిరితిత్తుల్లో కొంత భాగం దెబ్బతినడం, దగ్గులో రక్తం పడటం, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యలకు కూడా శస్త్రచికిత్స అవసరం కావచ్చని తెలిపారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పారు. మినిమల్ ఇన్వేసివ్ థొరాసిక్ సర్జరీ ద్వారా చిన్న కోతలతోనే ఊపిరితిత్తుల్లోని వ్యాధిగ్రస్త భాగాన్ని తొలగించే అవకాశం ఉందన్నారు. సాధారణంగా ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల పరిమాణంలో చిన్న కోతలతో శస్త్రచికిత్స చేయడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనికి మరింత ఆధునిక రూపంగా రోబోటిక్ థొరాసిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చిందని, యశోద ఆసుపత్రిలో ఈ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు.గతంలో ఊపిరితిత్తుల శస్త్రచికిత్స అంటే చాలా ప్రమాదకరమని భావించి రోగులు భయపడేవారని, ప్రస్తుతం ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ శస్త్రచికిత్సలు సురక్షితంగా నిర్వహించగలుగుతున్నామని డాక్టర్ రోహన్ రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల నుంచి కూడా పలువురు రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు.తాను కూడా సూర్యాపేటకు చెందినవాడినని, తన ప్రాంత ప్రజలకు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉంటే భయపడకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల్లో ఎవరికైనా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు ఉంటే ఈ సమాచారాన్ని వారికి చేరవేయాలని మీడియా ప్రతినిధులను కోరారు.ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ఇకపై భయపడాల్సినంత ప్రమాదకరమైనవి కావు. ఆధునిక మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ థొరాసిక్ సర్జరీలతో సురక్షితంగా చికిత్స అందించవచ్చు. అవసరమైన రోగులకు లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ కూడా సాధ్యమే. సరైన సమయంలో నిపుణులను సంప్రదిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చు అని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో యశోదా ఆసుపత్రి సీనియర్ మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కొయ్యూరు పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డిఐజి

**కొయ్యూరు పోలీస్ స్టేషన్, మహాదేవపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్**

భూపాలపల్లి జిల్లా 20 ఆగస్టు (విజన్ ఆంధ్ర) : వార్షిక తనిఖీల్లో భాగంగా కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్ నేడు భూపాలపల్లి జిల్లాలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్ మరియు మహాదేవపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ఐపీఎస్ డీఐజీ కి ఘన స్వాగతం పలికారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్,సర్కిల్ కార్యాలయాల పరిశుభ్రత,రికార్డుల నిర్వహణ,మాల్ఖానా, ఆయుధాగారం,వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది టర్న్‌అవుట్, క్రమశిక్షణ,యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను డీఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ అధికారులు, సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి విధి నిర్వహణ,పనితీరు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ :- ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీస్ సేవలు అందించడం ప్రతి పోలీస్ అధికారి బాధ్యత అని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని, ముఖ్యంగా జజుచీగా 2.0,, వ-ఘుఎంప్ట్రుఘు, డిజిటల్ ఫోరెన్సిక్స్,సైబర్ దర్యాప్తు,సోషల్ మీడియా మానిటరింగ్ వంటి అంశాల్లో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించడంతో పాటు నేరస్తుల కంటే ఒక అడుగు ముందుండే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. అదేవిధంగా డ్రగ్స్, గంజాయి,సైబర్ నేరాలు,ట్రాఫిక్ నియంత్రణ, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు,వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించే విధంగా సేవలందించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొయ్యూరు



పోలీస్ స్టేషన్,మహాదేవపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ ఆవరణలో డీఐజీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావు, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు,పోలీస్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లాటు లావాదేవీల్లో తనకు,శ్రీరమణ సొసైటీకి ఎలాంటి సంబంధం లేదు

**- తనపై తప్పుడు కేసులో మాజీ కార్పోరేటర్ భర్త హస్తం...**

**- కుట్రలను న్యాయపరంగా ఎదుర్కొంటానన్న శ్రీరమణ సొసైటి**

**- మాజీ అధ్యక్షుడు మాల్లారెడ్డి**



బోడుప్పల్,ఆగస్ట్20(విజన్ ఆంధ్ర) : శ్రీరమణ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన 172, 173 ప్లాట్ల లావాదేవీలతో తనకు, సొసైటీకి ఎలాంటి సంబంధం లేదని మాజీ అధ్యక్షుడు కారెడ్ల మాల్లారెడ్డి స్పష్టం చేశారు. తనపై డబుల్ రిజిస్ట్రేషన్ పేరుతో తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ కేసు వెనుక మాజీ కార్పొరేటర్ భర్త హస్తం ఉందని పేర్కొన్నారు.ఈసందర్భంగా సొసైటీ మాజీ అధ్యక్షుడు కారెడ్ల మాల్లారెడ్డి తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1980వ దశకంలో శ్రీరమణ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఏర్పాటైంది. అప్పట్లో సాలార్జంగ్ కంచెలోని 360 ఎకరాల స్థలానికి ఒప్పందం చేసుకుని ప్లాట్లుగా విభజించారు. 1983 నాటికి దాదాపు 90 ఎకరాల ప్లాట్లకు సభ్యులు చెల్లింపులు పూర్తి చేశారు. అయితే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిర్ణయాల వల్ల సొసైటీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీనిని అవకాశంగా తీసుకుని స్థానిక ల్యాండ్‌లార్డ్స్ సొసైటీకి రావాల్సిన 90 ఎకరాల స్థలాన్ని కాదని, మిగిలిన స్థలాన్ని వేరే కాలనీలకు (సాయిప్రియ, సాయి ఐశ్వర్య కాలనీలు) విక్రయించారు.సభ్యుల రక్షణ కోసం చర్యలు: చెల్లాచెదురైన సొసైటీ సభ్యులను ఏకం చేసి, నాటి పోలీసు ఉన్నతాధికారులను కలిసి 90 ఎకరాల స్థలాన్ని కాపాడటానికి సొసైటీ కృషి చేసింది. సభ్యులందరికీ లేఖలు పంపి, పేపర్ ప్రకటనలు ఇచ్చి వారి ప్లాట్లను కాపాడుకోవాలని సూచించడంతో చాలా మంది సరిహద్దు కాంపౌండ్ వాల్స్, గదులు నిర్మించుకున్నారు.ఇటీవల ప్లాట్ నంబర్లు 172, 173 లపై డబుల్ రిజిస్ట్రేషన్ చేశానంటూ తనపై తప్పుడు కేసు నమోదు చేశారని ఆయన స్పష్టం చేశారు.గతంలో సర్పంచ్‌గా పనిచేసిన రఘుపతి గౌడ్ అనే వ్యక్తి ఈ ప్లాట్లను సొసైటీ ద్వారా కేటాయించుకుని, కొన్నేళ్ల తర్వాత వేరే వారికి విక్రయించారని తెలిపారు. ఆ తర్వాత జరిగిన ప్లాట్ల కొనుగోళ్లు, అమ్మకాలతో (కళాధర్ వంటి వ్యక్తులతో) సొసైటీకి కానీ, తనకు కానీ ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. ప్రతి విషయం సొసైటీ రూల్స్, ఉమ్మడి నిర్ణయాలు, తీర్మానాల ప్రకారం జరిగినదని స్పష్టం చేశారు. గతంలో కాని ఎప్పుడు సొసైటీలో ఏలాంటి అవకతవకలు తావివ్వలేదని వెల్లడించారు. నిజానిజాలు, పాత రికార్డులను సమగ్రంగా పరిశీలించి తమకు తగిన న్యాయం చేయాలని, అబద్ధపు ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవద్దని ఆయన పోలీసులను, అధికారులను కోరారు.తనపై జరుగుతున్న కుట్రలను న్యాయపరంగా ఎదుర్కొంటానని మాల్లారెడ్డి స్పష్టం చేశారు.

# గద్వాల - డోర్నకల్ కొత్త లైన్ డిపిఆర్.పూర్తి...

**- గద్వాల - మాచర్ల లైన్ ఏళ్లతరబడి పెండింగ్ లో ఉంది దానిని పరిశీలించాలి**

**- రైల్వే అభివృద్ధి పనుల వేగం పెంచండి. ఎంపీ డీకే అరుణ**




గద్వాల ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : సికింద్రాబాద్ రైల్ నిలయంలో తెలంగాణ పార్లమెంట్ సభ్యులతో రైల్వే ఉన్నతాధికారుల సమావేశంలో జరిగింది. సమావేశంలో ఎంపీ డీకే అరుణ మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలోని రైల్వే అభివృద్ధి పనుల పురోగతి పై ఒక్కొక్కటిగా అడిగి తీసుకున్నారు. గత సమావేశంలో ఇచ్చిన ప్రపోజల్ లలో ఎన్ని మంజూరు అయ్యాయి, మిగిలిన ప్రపోజల్ ఏ స్టేజ్ లో ఉన్నాయని, వాటిని త్వరిత గతిన ముందుకు తీసుకువెళ్లేందుకు అధికారులు వేగవంతం కృషి చేయాలని అన్నారు. ఇప్పటివరకు సెంట్రల్ రైల్వే బోర్డుకు పంపిన ప్రతిపాదనలు ఏ స్టేజ్ లో ఉన్నాయని ఎంపీ డీకే అరుణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి మేరకు మలక్ పేట్ (హైదరాబాద్) రైల్వే స్టేషన్ లో హైదరాబాద్ డెక్కన్ (నాంపల్లి - కర్నూల్ ) హంద్రీ ఎక్స్‌ప్రెస్ (17027/17028) రైలు ఆపేందుకు రైల్వే అంగీకరించింది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అమృత భారత్ స్టేషన్ షాద్ నగర్,జడ్చర్ల, మహబూబ్ నగర్,గద్వాల జోగులాంబ స్టేషన్ లలో వందే భారత్ అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు,మౌలిక సదుపాయాల కల్పన పనులు సాగుతున్నాయి. జోగులాంబ గద్వాల స్టేషన్ లో పనులు పూర్తయ్యాయి. ప్రారంభానికి సిద్ధంగా ఉంది.వందే భారత్ అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా షాద్ నగర్ జడ్చర్ల స్టేషన్ లు మార్చి 2027, మహబూబ్ నగర్ రైల్వే స్టేషన్ జూన్ 2027 నాటికి,గద్వాల రైల్వే స్టేషన్ ఏప్రిల్ 2027 నాటికి పూర్తి చేస్తామని సమీక్షలో వెల్లడించారు. గద్వాలలో రెండవ లైన్ పనులు కూడా మంజూరు చేయించడం జరిగింది. ఆ పనులు త్వరలో ప్రారంభమవుతాయని అధికారులు వెల్లడించారు. కొవిడ్ సమయం నుంచి వనపర్తి,మక్తల్ లోని కృష్ణా, గద్వాల లో రైల్స్ స్టాప్స్ తీసివేశారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు వాటిని పునరుద్ధరించాలని కోరడం జరిగింది. వాటిని పరిశీలిస్తామని తెలిపారు. సికింద్రాబాద్ - రాయచూరు వెళ్ళే రైలు టైమింగ్ మార్చాలని కోరడం జరిగింది. టైమింగ్ మార్పులలో ఇబ్బందులు ఉన్నాయని కొత్త రైలు కోసం ప్రతిపాదనలు పంపుతున్నామని అధికారులు తెలిపారు. గద్వాల - డోర్నకల్ కొత్త లైన్ డిపిఆర్.పూర్తి అయ్యింది. గద్వాల - మాచర్ల లైన్ ఏళ్లతరబడి పెండింగ్ లో ఉంది దానిని పరిశీలించాలని కోరాడం జరిగింది.

# పాత్రికేయుడికి బెదిరింపులు...

**ఆయా నుంచి టీచర్‌గా ప్రమోషన్..**

**- నిజాలు రాస్తే సహించరా..?**

**- ఆన్‌లైన్ రాదు, సమయపాలనా లేదు..!**




సూర్యాపేట ఆగస్టు 20:(విజన్ ఆంధ్ర) సూర్యాపేట పట్టణంలోని 7వ వార్డు అంగన్వాడీ కేంద్రం అవస్థలపై వార్త ప్రచురించిన "విజన్ ఆంధ్ర" విలేకరిపై చరవాణి ద్వారా బెదిరింపులకు దిగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయా స్థాయి నుండి అంగన్వాడీ టీచర్‌గా పదోన్నతి పొందిన సదరు మహిళకు కనీసం స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ ఎంట్రీలు చేయడం కూడా రాదని, ఆమె అ సమయపాలన వల్ల చిన్నారుల భవిష్యత్తు నాశనమవుతోందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, విధుల్లో తీవ్ర అలసత్వం ప్రదర్శించడంపై ప్రజాహితం కోరి వార్త రాస్తే, తప్పు దిద్దుకోవాల్సింది పోయి విలేకరిపై బెదిరింపులకు దిగడం పట్ల జర్నలిస్ట్ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆన్‌లైన్ హాజరు, పౌష్టికాహార రికార్డులు కూడా నిర్వహించలేని స్థితిలో ఉన్న సదరు టీచర్ తీరుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన పాత్రికేయుడికి రక్షణ కల్పించాలని, బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను కోరుతున్నారు.

# ఏజెంటిక్ ఏఐ, భారత్-దుబాయ్ వాణిజ్య బలోపేతానికి ఒప్పందాలు




హైదరాబాద్, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : ఏజెంటిక్ ఏఐ, డీప్‌టెక్ సహకారం, భారత్-దుబాయ్ వాణిజ్య, పెట్టుబడుల బలోపేతం కోసం దుబాయ్ ఛాంబర్స్ నాస్కామ్, ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌కేసీసీఐ)తో రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని దుబాయ్ ఛాంబర్స్ ప్రెసిడెంట్, సీఈఓ హెచ్.ఈ.మహమ్మద్ అలీ రషీద్ లూతా గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుబయ్ ఏజెంటిక్ ఏఐపై దృష్టి భారతీయ టెక్నాలజీ కంపెనీలు, ఆవిష్కర్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తోందని అన్నారు. ఇటీవల తన నేతృత్వం లోని ప్రతినిధి బృందం నాస్కామ్ డీప్‌టెక్, సీఐఐ కర్ణాటక, ఎఫ్‌కేసీసీఐ, ఫిక్కీ కర్ణాటకతో సమావేశమైనట్లు చెప్పారు. నాస్కామ్‌తో ఒప్పందం ఏజెంటిక్ ఏఐ, డీప్‌టెక్ సహకారం, నాలెడ్జ్ షేరింగ్, ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణకు, ఎఫ్‌కేసీసీఐతో ఒప్పందం 'వర్చువల్ దుబాయ్ డెస్క్', మార్కెట్ ఎంట్రీ మార్గదర్శకత్వం, బిజినెస్ డెలిగేషన్లకు తోడ్పడనుందని తెలిపారు.

## పట్టపగలే చోరీ.. టీచర్ ఇంట్లో దొంగతనం..కేసు నమోదు

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన : సిఐ, ఎస్ఐ**



గద్వాల ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : గద్వాల పట్టణంలోని 2వ వార్డులో టీచర్ దంపతుల ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి వచ్చే సరికి తాళం విరిగి ఉండటాన్ని గుర్తించిన బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చోరీలో బంగారం, నగదు అపహరణకు గురైనట్లు సమాచారం. తొలుత 5 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు పోయినట్లు చెప్పిన బాధితులు. అనంతరం 4 తులాల బంగారం, రూ.25 వేల నగదు మాత్రమే పోయినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న గద్వాల్ సీఐ టంగుటూరి శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ కల్యాణ్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణ అనంతరం చోరీకి గురైన సొత్తు పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

## రాజీవ్ గాంధీ సేవలు దేశానికి చిరస్మరణీయం

**- డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**





సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు :20(విజన్ ఆంధ్ర ) : మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను ఆమె స్మరించుకున్నారు. దేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ, సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. దేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల విస్తరణకు రాజీవ్ గాంధీ తీసుకున్న చర్యలు భవిష్యత్ భారత నిర్మాణానికి బాటలు వేశాయని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారని ఆమె గుర్తుచేశారు. దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను, ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కౌన్సిలర్ లు గడ్డం రాజు, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు

## చెరువులను తలపిస్తున్న పట్టణ రోడ్లు..!

**- మున్సిపాలిటీకి కనువిప్పు ఎప్పుడో..?**



గద్వాల ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల పట్టణంలోని రోడ్ల దుస్థితి చూస్తే ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. మున్సిపాలిటీ ఉందా, పాలకవర్గం, అధికారులు ఉన్నారా అనే ప్రశ్నలు వాహనదారులు, స్థానిక ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ సమీపంలోని రాయచూర్ వెళ్లే ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం కురిసిన స్వల్ప వర్షానికే భారీగా నీరు నిలిచి చిన్న చెరువును తలపిస్తోంది. ఈ మార్గం మీదుగా ప్రతిరోజూ వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై నిలిచిన నీటితో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న వర్షానికే రోడ్డుపై చెరువు ఏర్పడితే,ఇక భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటి అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడానికి కారణమైన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని వారు అంటున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రోడ్లపై నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. సమస్య కళ్లముందే కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోతే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలన్న ప్రశ్న తలెత్తుతోంది.ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి రాఘవేంద్ర కాలనీ సమీపంలోని రాయచూర్ రహదారిపై నిలిచే నీటికి శాశ్వత పరిష్కారం చూపాలి. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు లేకుండా సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యపై మున్సిపాలిటీకి కనువిప్పు ఎప్పుడు వస్తుందో వేచి చూద్దాం.

## ఎస్ఐఅర్ పై నియోజకవర్గ బిఎల్ఏ లతో సమీక్ష సమావేశం

**- అలంపూర్ నియోజకవర్గ బిఎల్ఏ.లను అభినందించిన ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్**



వడ్డేపల్లి ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతి నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో అలంపూర్ నియోజకవర్గ బిఎల్ఏ. లతో గురువారం ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఐసీసీ కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎస్ఐఅర్. పై పెట్టిన ప్రత్యేక శ్రద్ధ కి అనుకూలంగా గత నెల రోజులుగా ప్రతి బూత్ లో బిఎల్ఏ. లు కీలకంగా, బాధ్యతగా పనిచేసినందుకు ముందుగా వారిని అభినందించారు. యిదే క్రమంలో ఎస్ఐఅర్. మొదటి విడత అనంతరం జరిగే చేయాల్సిన కార్యక్రమాలు రెండవ ఫేజ్ లో నింపాల్సిన ఫారం లు, పాటించాల్సిన నిబంధనలు గురించి అవగాహన కల్పించడం జరిగింది.అనంతరం కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లడం లబ్ధిదారులను కాంగ్రెస్ పార్టీ తో అనుసంధానం అయి ఉండేలా చూడటం, పేదవారికి అర్హులకు సంక్షేమ పథకాలను అందేలా చూడాలని అన్నారు .కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన ఓటర్లను గుర్తించి వారి ఓటును కాపాడాల్సిన బాధ్యత ప్రతి బి ఎల్ ఏ . ల పైన ఉందంటూ తెలియజేశారు . ఈ కార్యక్రమానికి అలంపూర్ నియోజకవర్గ ఇంచార్జి జాతీయ కిసాన్ సెల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ దులిపూడి,నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జి సిద్దేశ్వర్ ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ నియోజక వర్గంలోని అందరూ బూత్ లెవెల్ ఏజెంట్లు,ఇంచార్జి లు మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలి

**- ఎస్ఐఆర్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి**

**- జిల్లాలోని అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం**

**- జిల్లా ఎలక్ట్రోరోల్ అబ్జర్వర్ సురేంద్రమోహన్**





గద్వాల ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసి పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధిత అధికారులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ సహకరించాలని వ్యవసాయ, సహకార శాఖల రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరోల్ అబ్జర్వర్ సురేంద్రమోహన్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ఎస్ఐఆర్ పై జిల్లా ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి పరిశీలకులు ప్రసంగించారు. అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు ఓటరుగా నమోదు కావడానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా కాపీలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినందున బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో క్షేత్రస్థాయిలో సంబంధిత ఎన్నికల అధికారులకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్ఐఆర్ కు సంబంధించి ఇది మొదటి పర్యటన గా పేర్కొంటూ, మరో పర్యటనలో పోలింగ్ స్టేషన్లను కూడా సందర్శిస్తూ, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అప్పట్లోగా జిల్లా ఎన్నికల అధికారులు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తూ ముందుకెళ్లాలని ఈ సందర్భంగా పరిశీలకులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది ఓటర్లు అనామలీస్ జాబితాలో ఉన్నారని తెలిపారు. మ్యాపింగ్ జరగని ఓటర్లు 22,000 గా పేర్కొంటూ వీరందరికీ నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. మండలాలతో పాటు మున్సిపాలిటీలలో ఏఈఆర్వోలు నిర్దేశిత తేదీల్లో అవసరమైన ఓటర్లందరికి నోటీసులు ఇచ్చేందుకు టామ్ టామ్ చేయించడం, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం ఇస్తామన్నారు. సంబంధిత ఎన్నికల అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ఓటర్లందరూ ఓటు హక్కును కలిగి ఉండేందుకు కృషి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ కూడా పూర్తి కావడంతో జిల్లాలో ప్రస్తుతం 594 పోలింగ్ బూత్ లు ఉన్నాయన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్ఐఆర్ ను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో తరచూ గూగుల్ మీట్ లు, ఇతర సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే క్రమం తప్పకుండా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం పరిశీలకులు మండలాల, మున్సిపాలిటీల వారీగా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యకలాపాలపై సమీక్షించారు. అంతకుముందు పరిశీలకులు కలెక్టర్ తో కలిసి ఉద్యానవన, సహకార శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలపై ఏర్పాటుచేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తున్న ప్రభుత్వం

**- ఇందిరమ్మ ఇండ్లు పథకాల ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రములో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల నియోజకవర్గం లో & టౌన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన వారికి గుడిసెలు ఉన్నవారికి లబ్ధిదారులు అర్హులైన వారికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలోని ప్రజలు వలసలుగా వెళ్లేవారు కానీ నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి మీ ప్రాంతంలోని ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేయడం జరిగింది. ఏ ప్రభుత్వాలు వచ్చిన ప్రభుత్వం తో వప్పించి ప్రభుత్వం నుండి నిధులను తీసుకొచ్చి ఈ ప్రాంత అభివృద్ధి కొరకు సాయి శక్తుల కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు సొంత ఇండ్లు లేక పూరి గుడిసెలో నివసిస్తున్న వారికి ప్రభుత్వము దూర దృష్టితో ఆలోచించి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేసి, ప్రతి ఒక్క పేద ప్రజల సొంతింటి కలను ఇందిరమ్మ ఇల్లు తోనే సాధ్యం చేసిందని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో గుడిసెలు లేకుండా ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు మంజూరైన వారు ఇంటి నిర్మాణాలు పనులను ప్రారంభించాలని కోరారు. అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేయడం జరుగుతుంది తెలిపారు.ఎవరు కూడా ఆందోళన పడాల్సిన అవసరం లేదు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహాలు యాదవ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు,పిఏసిఎస్. ఛైర్మెన్ తిమ్మారెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి ,రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీలు విజయ్, రాజారెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ శంకర్, మాజీ ఆలయం ఛైర్మెన్ సతీష్, కౌన్సిలర్స్, సర్పంచులు, మాజీ కౌన్సిలర్, మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు8 ఫ్యాన్లు బహుకరణ



నారాయణపేట , ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని జాజాపూర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు గురువారం నారాయణపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలకు 8 ఫ్యాన్లను బహుకరించారు . ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి అధ్యక్షత వహించగా మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలకు ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని. ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మంచిగా చదివి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని ఆయన పాఠశాల అధ్యాపకులకు తెలిపారు.అదేవిధంగా పాఠశాలకు ఏ సహాయం కావాలన్నా నా దృష్టికి తీసుకువస్తే సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల మధుసూదన్ రెడ్డి మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు కాంత్ కుమార్ నారాయణపేట కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్, మైనార్టీ మోర్చా నాయకులు గౌస్ ఎమ్మెల్యే వ్యక్తిగత సలహాదారుడు మాధవరెడ్డి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సంతోష్ కుమార్ గ్రామ సర్పంచ్ సంగీత రాములు ఉప సర్పంచ్ లక్ష్మణ్ వార్డ్ మెంబర్లు లింగప్ప రవి బ్రహ్మానందరెడ్డి మరియు కాంగ్రెస్ కార్యకర్తలు నీలి రాములు ఆలుగడ్డ రవి వెంకటప్ప తదితరులు అందరూ పాల్గొన్నారు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం హెచ్ భాను ప్రకాష్ నరసింహ నరసింహులు మధుసూదన్ రావు వెంకటేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలి

**- అలంపూర్ ఏరియా ఆసుపత్రిలో కన్వర్జెన్సీ సమావేశం**

**- మానోపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ. డాక్టర్ జె. సంధ్య కిరణ్మై**

అలంపూర్ ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్. జె. సంధ్య కిరణ్మై ముఖ్య అతిథిగ హాజరయ్యారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, యుక్తవయస్కులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అందించే ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగ అమలు చేయాలని సూచించారు. అదేవిధంగ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అనుబంధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో సంబంధిత శాఖలన్నీ పరస్పర సహకారంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారి డా. ప్రసూనరాణి, డా. కిషోర్ సివిల్ సర్జన్, డా.వరలక్ష్మి డిపిఓ, వైద్యాధికారులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మానోపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగ డిఎంహెచ్ఓ. డాక్టర్ జె. సంధ్య కిరణ్మై తనిఖీ చేశారు. హాజరు పట్టిక, వివిధ రికార్డులను పరిశీలించి, ప్రసూతి గది, ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు వైద్య సిబ్బందికి పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు.





## బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్



ఎర్రవల్లి ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని గురువారం తెలంగాణ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో పురందరు కుమార్ అర్చకులు సందీప్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవాలయంలో గోత్రనామాలతో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ విశిష్టత గురించి ఈవో వారికి వివరించారు.

## పేట జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

నారాయణపేట, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : సెప్టెంబర్ 11 తేదీ నుండి 13వ తేదీ వరకు సూర్యాపేట జిల్లా కోదాడలో జరగనున్న 73వ తెలంగాణ రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొనే నారాయణపేట జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపికలు ఈనెల 23న ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి. నాగేశ్వర్ రెడ్డి, కార్యదర్శి సి. వెంకటప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నారాయణపేట మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే మహిళ క్రీడాకారులు 75 కిలోల లోపు బరువు ఉండాలని వారు తెలిపారు. కబడ్డీ క్రీడ ఎంపికలకు వచ్చే మహిళలు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని సమాచారం కొరకు 99591 86668, 94914 89754 సెల్ ఫోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో కార్యకర్తలకు అన్నదానం



నారాయణపేట, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి జన్మదినం సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్ లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమాన్ని నారాయణపేట మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ లు అన్న దాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తుందని వారు తెలిపారు.అంతేకాకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పేద ప్రజలు సతియోగం చేసుకోవాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.పేద ప్రజలకు రేషన్ బియ్యాన్ని అందించే ఐదు కిలోలను ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు.కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతినిత్యం గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి నాయకులు కురువ మనోజ్ నాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

**- మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత**



సూర్యాపేట ఆగస్టు 20:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట పట్టణంలోని ప్రతి వార్డులో వార్డు అభివృద్ధి కోసం ఐదు లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. గురువారం 38 వ వార్డులో సత్రం బజార్ లో ఐదు లక్షల రూపాయల వ్యయంతో డ్రైన్ ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మరియు టూరిజం కార్పొరేషన్ మాజి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ల సహకారంతో నిధులు తీసుకుని వస్తామని చెప్పారు. సూర్యాపేట పట్టణంలో ప్రతి వార్డును అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ వుల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, వార్డు కౌన్సిలర్ గండూరి రమేష్, నాగుల వాసు, బండారు వెంకన్న, ఫారుక్ , మహమ్మద్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి విగ్రహావిష్కరణ



మంచిర్యాల టౌన్, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ కేంద్ర మంత్రివర్యులు గడ్డం వెంకటస్వామి విగ్రహావిష్కరణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది మంతెన జగన్ మోహన్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంతెన జగన్ మోహన్ రావు మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి కాకా గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా, కార్మిక నాయకుడిగా ఆయన అందించిన సేవలు అమూల్యమైనవి. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం, వారి విద్యా, ఉద్యోగ, రాజకీయ అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు. ఆయన ఆశయాలను, ఆదర్శాలను కొనసాగించడమే మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. మంచిర్యాల నడిబొడ్డున, అందరికీ కనిపించే విధంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సముచితమని, రాబోయే తరాలకు ఆయన స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంతెన జగన్ మోహన్ రావు కి నిర్వాహకులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య మరియు మంచిర్యాల మున్సిపల్ 36వ డివిజన్ కార్పొరేటర్ రాణి–రాజు ప్రజాప్రతినిధులు గడ్డం వెంకటస్వామి అభిమానులు కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## స్మశాన వాటిక భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి




నిజామాబాద్ ఆగస్టు 20: (విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ గురువారం నగరంలో ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం బాల్కొండ మండలం బస్సాపూర్ గ్రామానికి చెందిన దళిత స్మశాన వాటికకు సంబంధించిన భూమిని ఆక్రమణకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన దళితులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని సర్వే నంబర్ 612లో ఉన్న స్మశాన వాటిక భూమిని ఒకే కుటుంబానికి చెందిన తోట పెంటన్న, తోట గణేష్‌లు ఆక్రమించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్మశాన వాటిక భూమి విషయంలో ప్రశ్నించేందుకు వెళ్లిన దళితులను బెదిరిస్తూ, భయభ్రాంతులకు ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో వారు మాట్లాడడం జరిగింది అంతేకాకుండా వారు ఆరోపించారు. గతంలో స్మశాన వాటిక భూమిని పరిరక్షించేందుకు ప్రయత్నించిన దళిత గోసంగిలపై కూడా కేసులు నమోదు చేయడం జరిగిందని వారు తెలిపారు. దళిత గోసంగి స్మశాన వాటిక భూమిని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఈ విషయంలో అధికారులు వెంటనే జోక్యం చేసుకుని భూమిని పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని కోరారు. స్మశాన వాటిక భూమి విషయంలో సమగ్ర విచారణ జరిపి, భూమిని పరిరక్షించడంతో పాటు ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను వారు కోరారు. ఈ సమస్యపై తక్షణమే రెవెన్యూ అధికారులతో సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించి, దళితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి అధికార ప్రతినిధి గంధం రాజేష్, బేడ బుడగ జంగం జన సంఘం జిల్లా అధ్యక్షులు డొక్క రంజిత్, ఉపాధ్యక్షులు సదుల రాజేశ్వర్, మాజీ సర్పంచులు కర్రే లింగస్వామి, కర్రే గంగయ్య గోసంగి కులస్తులు నడిపి సాయిలు, కర్రే రాజన్న, రాసుల గంగాధర్, గంగయ్య లతో పాటు 50మంది దళిత గోసంగి కులస్తులు పాల్గొన్నారు.

## ఫారం పాండ్లతో భూగర్భ జలాల పెంపు

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫారం పాండ్ల నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం పానగల్ మండలం గోప్లాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతు పల్లవి పొలంలో చేపడుతున్న ఫారం పాండ్ పనులను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి కొరత ఉన్నందున రైతులు వరికి బదులుగా వేరుశెనగ, పెసర, కంది వంటి ఆరుతడి పంటలను సాగు చేసి ఆర్థిక నష్టాల నుంచి బయటపడాలి. మహిళా సంఘాల ద్వారా ఫారం పాండ్ల ప్రయోజనాలపై రైతుల్లో అవగాహన పెంచాలని, జిల్లాకు నిర్దేశించిన నిర్మాణ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గోప్లాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. వంటగది పరిశుభ్రతను, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ యాదయ్య, డిప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



## భూముల రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి

**- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అమరచింత మండలం చింతరెడ్డిపల్లిలో సాగుతున్న రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి సరిహద్దులు, రికార్డుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**గురుకుల పాఠశాల తనిఖీ..**

అనంతరం పెద్దమందడి మండలం జగత్పల్లిలోని మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. తరగతి గదులు, వసతి గృహాన్ని పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు నిరంతరం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతులను పర్యవేక్షించాలని హాస్టల్ నిర్వాహకులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# బోనాల జాతర.. బోడుప్పల్‌లో పొలిటికల్ జాతర!

**- అమ్మవారి పండుగకు రాజకీయ రంగు.. అడుగడుగునా ఫ్లెక్సీల హోరు**

**- నువ్వా.. నేనా అన్నట్లుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల పోటాపోటీ**

**- శుభాకాంక్షల పేరుతో రాజకీయ బలప్రదర్శనా? స్థానికంగా జోరుగా చర్చ**




బోడుప్పల్,ఆగస్ట్ 20(విజన్ ఆంధ్ర) : బోనాల పండుగ అంటే భక్తి, ఆధ్యాత్మికత, అమ్మవారి సేవలు, పండుగ సందడి. కానీ బోడుప్పల్‌లో ఈసారి పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తోంది. అమ్మవారి జాతర సందడి కంటే రాజకీయ ఫ్లెక్సీల హోరు ఎక్కువగా కనిపిస్తుండటంతో.. 'బోనాల జాతరా.. పొలిటికల్ జాతరా?' అన్న చర్చ స్థానికంగా మొదలైంది. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, కాలనీల పరిసరాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు పెద్ద సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. బోనాల శుభాకాంక్షల పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ఫ్లెక్సీల్లో స్థానిక నాయకుల ఫొటోలు, పార్టీ ప్రముఖుల చిత్రాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి.

**నువ్వా.. నేనా అన్నట్లుగా పోటీ**

ఒక పార్టీ నాయకుడు భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే.. మరో పార్టీకి చెందిన నాయకులు కూడా అందుకు తగ్గట్టుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారనే చర్చ సాగుతోంది. దీంతో 'మా ఫ్లెక్సీ పెద్దది.. మా నాయకుడి ఫొటో ఎక్కువగా కనిపించాలి' అన్నట్లుగా రాజకీయ పోటీ నెలకొన్నట్టు స్థానికులు చెబుతున్నారు.
పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేయడం సాధారణమే అయినప్పటికీ.. భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, వాటిపై రాజకీయ నాయకుల ఫొటోలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఇది కేవలం శుభాకాంక్షల ప్రచారమా.. లేక రాజకీయంగా తమ ఉనికిని చాటుకునే ప్రయత్నమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**బోనాల కంటే రాజకీయ ఫ్లెక్సీలే హాట్‌టాపిక్**

బోనాల ఉత్సవాలకు ముందు నుంచే ప్రధాన రహదారుల వెంట వరుసగా వెలుస్తున్న ఫ్లెక్సీలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. భక్తులు అమ్మవారి దర్శనం, పూజలు, బోనాల ఊరేగింపులపై దృష్టి పెడుతుండగా.. రాజకీయ వర్గాల్లో మాత్రం ఎవరి ఫ్లెక్సీలు ఎక్కువగా ఉన్నాయి? ఎవరి ప్రచారం ఎక్కువగా కనిపిస్తోంది? అన్న చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది.

**పండుగ వేదిక.. రాజకీయ ప్రచార వేదికగా మారుతోందా?**

బోనాలు భక్తి, సంప్రదాయాలకు ప్రతీక. అలాంటి పండుగను రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చకూడదని కొందరు అభిప్రాయపడుతు న్నారు. మరోవైపు పండుగ సందర్భంగా తమ అభిమాన నాయకులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేయడంలో తప్పేమీ లేదని రాజకీయ పార్టీలకు చెందిన కొందరు చెబుతున్నారు. అయితే ఫ్లెక్సీల సంఖ్య, వాటి పరిమాణం, ఒకరిని మించి మరొకరు ఏర్పాటు చేస్తున్న తీరు చూస్తే..బోడుప్పల్‌లో బోనాల పండుగకు రాజకీయ పోటీ కూడా తోడైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతమా?**

బోనాల సందర్భంగా కనిపిస్తున్న ఈ రాజకీయ ఫ్లెక్సీల పోటీ కేవలం పండుగ శుభాకాంక్షలకే పరిమితమా? లేక రాబోయే రాజకీయ పోరుకు ముందస్తు సంకేతమా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎవరి బలం ఎంత? ఎవరి ప్రభావం ఎంత? అన్న విషయాన్ని చాటుకునే ప్రయత్నంగానే ఈ ఫ్లెక్సీల పోటీని కొందరు రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు. ఏదేమైనా.. అమ్మవారి ఆశీస్సుల కోసం భక్తులు తరలివస్తున్న వేళ, బోడుప్పల్ ప్రధాన రహదారులు మాత్రం భక్తి సందడితో పాటు రాజకీయ రంగులతోనూ నిండిపోవడం ఇప్పుడు స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారింది.

## టీబి ముక్త భారత్ పై స్పెషల్ ఆఫీసర్లకు శిక్షణ



నిజామాబాద్ ఆగస్టు20:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ గురువారం ఈ రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని క్షయ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రత్యేక అధికారులకు టిబి ముక్తభారత్ అభియాన్ పై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఐ డి ఓ సి సమావేశ మందిరంలో నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ అండ్ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ భవిష్ మిస్రా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు , పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ భవేష్ మిశ్రా మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పోషకాహార పారితోషము (డిబిటి) ను జనవరి నుండి జూన్ వరకు మంజూరైన నిధులను 100% పూర్తి చేయాలన్నారు, జిల్లాలో ఇప్పటివరకు కేవలం 47% మాత్రమే పూర్తి చేసినందున మిగతాది త్వరలోనే పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా 126 క్షయ వ్యాధిగ్రస్తులకు ఆధార్ లింకు బ్యాంక్ అకౌంట్ లేనందు వల్ల డిబిటి తిరస్కరించడం జరిగింది కావున వారిని కూడా ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్ లను చేయించి డిబిటి నీ ఇవ్వాలన్నారు. అన్ని మండలాలలో ఉన్న ప్రత్యేక అధికారుల సహాయ సహకారాలతో స్వచ్ఛంద సేవా సంస్థలను మోటివేట్ చేస్తూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్లు ఇచ్చే లాగా చూడాలన్నారు. క్షయ వ్యాధిపై వివరణత్మకమైన సమాచారం కంటే క్షేత్రస్థాయిలో సాధించిన లక్ష్యం మరియు ఎదురైన అవరోధాలను దృష్టిలో ఉంచుకొని మిగతా లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 975 క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, ప్రతి మండలంలో ఉన్న స్పెషలాఫీసర్, ఐదుగురు ఎన్సిసి వాలంటీర్లు మరియు ఐదుగురు మేరా యువభారత్ వాలంటీర్లతో కలిపిఆ మండలంలో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తుల పై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి ఒక క్షయ వ్యాధిగ్రస్తుడికి పోషకాహార కిట్టును ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. టీబీ ఎంబీఏ 1.0 2025లో జనవరి నుండి జూన్ వరకు 97% చికిత్స పూర్తయిందని అన్నారు. నిక్షయ్ పోర్టల్ ను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, నిక్షయ్ మిత్ర లో సైకో సోషల్ మిత్ర, న్యూట్రిషన్ సపోర్ట్ మిత్ర, డయాగ్నోసిస్ సపోర్ట్ మిత్ర గా నమోదు చేయాలన్నారు. ఆ తర్వాత క్షయ వ్యాధికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని పిపిటి ద్వారా డిటిసి ఓ డాక్టర్ దేవీ నాగేశ్వరి చెప్పడం జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఎ పి డి సాయన్న, జడ్పీ సీఈవో సాయా గౌడ్, డి ఐ ఓ డాక్టర్ అశోక్, జిల్లా ఉప వైద్యాధికారి నిజామాబాద్ డివిజన్ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ సుప్రియ డాక్టర్ వెంకటేష్ డాక్టర్ నవ్య, వివిధ మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## విజయ డైరీ పెంచిన పాల ధరల కరపత్రాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**- పాడి రైతులు పెంచిన పాల ధరలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**




మహబూబ్ నగర్ ఆగస్టు 20 విజన్ ఆంధ్ర ప్రతినిధి : పాడి రైతుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని విజయ డైరీ పాల కొనుగోలు ధరలను పెంచిందని, పెంచిన ధరలను పాడి రైతులు సద్వినియోగం చేసుకొని విజయ డైరీ పాల సేకరణ కేంద్రాల్లో పాలు విక్రయించి ఆర్థికంగా లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో తన ఛాంబర్ లో విజయ డైరీ పాడి రైతులకు పెంచిన పాల కొనుగోలు ధరలకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్, డైరీ డెవలప్‌మెంట్ డి. సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ, విజయ డైరీ గేదె పాల కొనుగోలు ధరను లీటరుకు రూ.6, ఆవు పాల కొనుగోలు ధరను లీటరుకు రూ.2 చొప్పున పెంచినట్లు తెలిపారు. పెంచిన ధరలు 16.08.2026 నుంచి అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. పాడి రైతులకు గిట్టుబాటు ధరతో పాటు ప్రతి 15 రోజులకు పాల బిల్లుల చెల్లింపు, పాడి పశువులకు బీమా సౌకర్యం, తక్కువ ధరకే నాణ్యమైన పశుదాణా, పశుపోషణకు అవసరమైన కాల్షియం, మినరల్ మిక్చర్, నట్టల నివారణ మందులు, గడ్డి విత్తనాలను విజయ డైరీ ద్వారా అందిస్తున్నట్లు డీడీ తెలిపారు. అదేవిధంగా పాడి పశువుల కొనుగోలుకు యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడి రైతులు మధ్యవర్తులు, ఇతర ప్రైవేటు డైరీలకు పాలు విక్రయించి నష్టపోకుండా విజయ డైరీ పాల సేకరణ కేంద్రాల్లోనే పాలు విక్రయించాలని, తద్వారా పెంచిన పాల ధరలతో పాటు విజయ డైరీ అందిస్తున్న ఇతర సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని డీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివానంద స్వామి, డి ఆర్.డి.ఓ నర్సింహులు, డైరీ మేనేజర్ యాకన్న తదితరులు పాల్గొన్నారు.

## బీసీ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**- 100% సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు**

**- దరఖాస్తుకు చివరి గడువు సెప్టెంబర్ 15**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



గద్వాల ఆగస్టు 20( విజన్ ఆంధ్ర బ్యూరో) : రాష్ట్రంలోని బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 100% సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మార్గదర్శకాల ప్రకారం ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 1,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను, ఒక్కో యూనిట్‌కు రూ.12,000 చొప్పున 100% సబ్సిడీపై అర్హులైన బీసీ మహిళలకు అందజేయనున్నారు. దరఖాస్తుదారులు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళ అయి ఉండాలి. నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, మేరా/మేరు (మేర /మేరు) కమ్యూనిటీకి చెందిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. దరఖాస్తుదారుల వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలకు మించకూడదు. తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుంది. కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 15వ తేదీలోగా https://tgobmms.cgg.gov.in పోర్టల్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన కోసం మండలాల వారీగా ఎంపీడీఓ/మున్సిపల్ కమిషనర్ కన్వీనర్లుగా మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థుల జాబితాను జిల్లా స్థాయి కమిటీకి పంపుతారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద ఇప్పటికే లబ్ధి పొందిన వారు అనర్హులు. డూప్లికేషన్ లేకుండా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సిజిజి) సహాయంతో పూర్తి పారదర్శకతను పాటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ ఆమోదం అనంతరం, ప్రభుత్వ నిబంధనలు, ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధుల సమక్షంలో అర్హులైన మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందజేస్తారు. అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ సూచించారు.


## ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 20,(విజన్ ఆంధ్ర) : జిల్లాలో 2026 సీజన్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారి చెన్నూరి కిష్టయ్య లతో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, తూనికలు కొలతలు, సెర్ప్ శాఖల అధికారులతో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026 ఖరీఫ్ సీజన్ సంబంధిత వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో 23 వేల 934 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఇందుకుగాను ధాన్యం కొనుగోలు కొరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లను ఇప్పటి నుండే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఎత్తు ప్రాంతాలలో ఉండి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేలా స్థలాలను గుర్తించాలని, గోనె సంచుల లభ్యత, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు, టార్పాలిన్ కవర్లు అవసరం ఉన్న మేరకు ప్రభుత్వానికి ఇండెంట్ సమర్పించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, జిల్లా మేనేజర్ రజిత, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, సహాయ పౌర సరఫరాల అధికారి సాదిక్ హుస్సేన్, ఐ.కె.పి., సహకార, తూనికల కొలతల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ తో వీడియో కాన్ఫరెన్స్లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర) : హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ...ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న ఓటర్ల గుర్తింపుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఫారాలపంపిణీ, సేకరణ పూర్తయిన అనంతరం మ్యాపింగ్‌కాని, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్లకు నోటీసులు జారీచే యాలని సూచించారు. నోటీసులుఅందుకున్న వారు నిర్ణీత తేదీ, సమ యంలో హాజరై పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువ పత్రాలను సమర్పించాల్సిఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకో వాలని స్పష్టం చేశారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించాలని, అక్టోబర్ 15 వరకు నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేసి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టా లని ఆదేశించారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలకు కార్యాచరణ ప్రణాళి క రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై పూర్తిస్థాయి అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువప త్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. నోటీసుల జారీ నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం వరకు ప్రతిదశను సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులో ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమీకృతజిల్లాకార్యాలయ సముదాయం నుండి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# ‘విజన్ ఆంధ్ర‘ కథనానికి అదిరిపోయే రెస్పాన్స్!

- వెనువెంటనే స్పందించిన పెన్ పహాడ్ సర్పంచ్ వగ్గు రవి
- సొంత ఖర్చులతో ప్రధాన రహదారిపై ముళ్లపొదలు, చెట్ల కొమ్మల తొలగింపు
- వాహనదారుల నరకయాతనకు చెక్.. సర్పంచ్, పత్రికపై ప్రజల ప్రశంసల జల్లు



**పెన్ పహాడ్, ఆగస్టు 20 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కారంలో ‘విజన్ ఆంధ్ర‘ దినపత్రిక అగ్రగామిగా నిలిచింది. పెన్ పహాడ్ నుండి దుబ్బ తండకు వెళ్లే ప్రధాన రహదారి ముళ్లపొదలతో నిండిపోయి, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారంటూ పత్రికలో ప్రచురితమైన కథనం క్షేత్రస్థాయిలో పెను సంచలనం సృష్టించింది. ఈ వార్తకు అధికారులు, ప్రజాప్రతినిధులు వెనువెంటనే స్పందించారు.

**- నిధుల కోసం ఎదురుచూడకుండా.. సొంత ఖర్చులతో:**

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తూముల సురేష్ రావుల ఆదేశానుసారం.. పెన్ పహాడ్ గ్రామ సర్పంచ్ వగ్గు రవి అత్యంత ఉదారతతో స్పందించారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా, ప్రజా క్షేమమే ధ్యేయంగా తన సొంత ఖర్చులతో రంగంలోకి దిగారు. రహదారిని కమ్మేసిన ప్రమాదకరమైన ముళ్లపొదలను, అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను కూలీలతో పూర్తిగా తొలగించి, మార్గాన్ని సుగమం చేశారు. దీంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


**- సమస్య ఏదైనా ‘విజన్ ఆంధ్ర‘ వస్తే చాలు..!**

“సమస్య ఏదైనా.. విజన్ ఆంధ్రలో వార్త వస్తే చాలు, అధికారులు–ప్రజాప్రతినిధులు సత్వరమే పరిష్కరిస్తున్నారు“ అని మండల వాసులు సగర్వంగా కొనియాడారు. ప్రజల పక్షాన నిలిచి, ప్రజా ప్రయోజనార్థం నిరంతరం వార్తలు రాస్తూ అందరి మన్ననలు పొందుతున్న విజన్ ఆంధ్ర దినపత్రిక యాజమాన్యానికి మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అధికారుల, ప్రజాప్రతినిధుల మనసు గెలుచుకుంటూ ముందుకు సాగుతున్న విజన్ ఆంధ్ర కథనాన్ని గ్రామ సర్పంచ్ సైతం ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ ప్రజల కోసమే కాకుండా, మండల ప్రజలందరి అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న సర్పంచ్ వగ్గు రవి గారిపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

# నేర నియంత్రణపై ప్రత్యేక ఫోకస్ చేయాలి

- కేసుల దర్యాప్తులో వేగం, నాణ్యత పెంచండి - జిల్లా ఎస్పీ డి.జానకి
- భూత్పూర్ సర్కిల్ వార్షిక తనిఖీలో కీలక ఆదేశాలు





ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర,ఆగస్టు 20: ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని, అందుకోసం నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని భూత్పూర్, మూసాపేట, అడ్డాకల్, దేవరకద్ర, సీసీ కుంట పోలీస్ స్టేషన్ల పనితీరును క్షుణ్ణంగా సమీక్షించారు. చీఎ–44, చీఎ–167 జాతీయ రహదారులు ఈ సర్కిల్ మీదుగా వెళ్తున్నందున రోడ్డు ప్రమాదాలు, హైవే నేరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తు విషయంలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు ఎలాంటి జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, బలమైన ఆధారాలతో కోర్టులో నిరూపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కేసు పురోగతిని వారానికోసారి సమీక్షించాలని ఎస్ హెచ్ ఓ లకు సూచించారు. నేరాలు జరగక ముందే నివారించే దిశగా చర్యలు ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై 24 గంటల నిఘా ఉంచాలని, బీట్ సిబ్బంది గ్రామాలు, కాలనీల్లో ప్రజలతో నిరంతరం టచ్‌లో ఉండాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడిని గౌరవంగా చూడాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, బాలల భద్రత, సైబర్ క్రైమ్, డ్రగ్స్ నివారణపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రజా అనుకూల పోలీసింగ్ ద్వారా ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత పెరగాలని కోరారు. ఈ తనిఖీలో భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు నాగన్న, విద్యా, మురళి, భాస్కర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# “గురుదేవోభవ“ కాదు... “గురువును చంపేభవ“ అయిందా?...

## మందలించినందుకు ప్రాణాలు తీసిన విద్యార్థులు - భయంతో వణికే క్లాస్‌రూమ్‌లు

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 20:** ఒకప్పుడు గురువు కనిపిస్తే కాళ్లకు మొక్కేవాళ్లం. “గురుదేవోభవ“ అని గౌరవించేవాళ్లం. ఈరోజు అదే గురువు మందలించినందుకు కత్తితో 27 సార్లు పొడిచి చంపే రోజులు వచ్చాయి. నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య ఈ సమాజానికి పెద్ద కనువిప్పు. ఆగస్ట్ 11 సాయంత్రం. స్కూల్ నుండి ఇంటికి వచ్చి అలసట తీర్చుకుంటున్న రూపా రెడ్డి ఇంట్లోకి ఇద్దరు మాస్క్ ధారణులు గోడ దూకి వచ్చారు. వాళ్లు ఎవరో కాదు, ఆమె చదువు చెప్పిన పిల్లలే. ఉద్దేశం ఒక్కటే - స్కూల్ ఫీజుల డబ్బు దొంగిలించడం. దురదృష్టవశాత్తు ఒకడి మాస్క్ కింద పడిపోయింది. తనను గుర్తుపట్టిందనే భయంతో, కోపంతో కత్తి తీశారు. 27 కత్తి పోట్లు. నేలపై పడిపోయిన ఆమె ఫోన్, డబ్బు తీసుకుని పారిపోయారు. పోలీసులు రంగంలోకి దిగి 5 బృందాలు, దాదాపు 70 సీసీ కెమెరాలు గాలించారు. రూపా రెడ్డి చివరిసారి “బాబు“ అని పిన్నితో మాట్లాడిన కాల్ ఆధారంగా అనుమానం స్కూల్ పిల్లల వైపు తిరిగింది. స్కూల్ రీ ఓపెన్ అయ్యాక గైర్హాజరైన 13 మంది 10వ తరగతి పిల్లలను పిలిచి విచారించారు. అందులో ఇద్దరి చేతులు వణుకుతున్నాయి. ఒకడి దగ్గర రూ.1.54 లక్షల నగదు. “మా అమ్మాన్న ఇచ్చారు“ అన్నాడు. కానీ ఆ నోట్లపై రక్తపు మరకలు. ల్యాబ్‌కు పంపితే అది రూపా రెడ్డి రక్తమే అని తేలింది. విచారణలో అసలు కథ బయటపడింది. ఒక విద్యార్థికి మద్యం అలవాటు, బైకుల మోజు. హాస్టల్‌లో బ్యాగులో నగదు, ఫోన్ చూసి రూపా రెడ్డి మందలించి



దే స్కాలర్‌గా మార్చింది. అప్పటి నుండే ఆమెపై కక్ష పెంచుకున్నాడు. నెల రోజుల క్రితం గోవా తిరిగొచ్చి “ఎలాగైనా డబ్బు కావాలి“ అనుకున్నాడు. ఐదు రోజుల క్రితమే రెక్కీ చేశాడు. స్కూల్ ఫీజుల డబ్బు ఇంట్లో ఉంటుందని తెలిసి ఆ రోజు దాడికి ప్లాన్ చేశాడు. ఇప్పుడు ఆ ఐదుగురు మైనర్లు జువెనైల్ కోర్టులో ఉన్నారు. రూపా రెడ్డి కుటుంబం మాత్రం శూన్యంలో ఉంది.

### ఈ హత్య మనల్ని ఏం అడుగుతోంది?

ఈరోజు టీచర్లు క్లాస్‌లోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. పిల్లాడు తప్పు చేస్తే మందలించాలా? వద్దా? మంచి మాట చెబితే రేపు తనపైనే దాడి జరుగుతుందేమో అనే భయం. “గురుదేవోభవ“ అనే పదానికి అర్థం లేకుండా పోతోంది. రీల్స్‌లో హింస కూల్‌గా కనిపిస్తోంది. చేతిలో ఫోన్, బ్యాగులో డబ్బు, తల్లిదండ్రుల పట్టింపు లేకపోవడం - ఇవన్నీ కలిసి ఒక మైనర్ చేతిలో కత్తి పెట్టాయి. రూపా రెడ్డి చనిపోయింది కేవలం దొంగతనం కోసం కాదు. ఆమె క్రమశిక్షణ చెప్పినందుకు, బాధ్యతగా మెలిగినందుకు.

### ఇకనైనా ఆగుతుందా?

ఈ విషాదం తర్వాతనైనా ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ప్రతి స్కూల్‌లో కౌన్సెలర్ ఉండాలి. పిల్లల మానసిక స్థితిని గమనించాలి. సోషల్ మీడియాలో హింసను ప్రోత్సహించే కంటెంట్‌పై కఠిన చర్యలు ఉండాలి. గురువుపై దాడి చేస్తే కఠిన శిక్షలు పడేలా ప్రత్యేక చట్టం రావాలి. అన్నిటికంటే ముఖ్యం - ఇంట్లో తల్లిదండ్రులు. మీ పిల్లాడి చేతిలో ఎంత డబ్బు ఉంది? ఫోన్‌లో ఏం చూస్తున్నాడు? ఎవరితో తిరుగుతున్నాడు? అని రోజూ అడగాలి.

### ఈరోజు రూపా రెడ్డి. రేపు మరో గురువు.

గురువులను చంపితే రేపటి తరానికి పాఠం చెప్పేది ఎవరు? భవిష్యత్తుకు పునాది వేసేది ఎవరు? ఈ ప్రశ్నకు సమాధానం ప్రభుత్వం, సమాజం, మనమందరం కలిసి చెప్పాలి. లేదంటే క్లాస్‌రూమ్‌లో పాఠం కాదు, భయమే మిగులుతుంది.

# పాత ఫోన్ ఇస్తే ప్లాస్టిక్ డబ్బా!!

## వ్యక్తిగత డేటాకు పెను ముప్పు

- గల్లీల్లో బీహార్ గ్యాంగ్ డిజిటల్ స్కెచ్
- స్క్రాప్ వెనుక భారీ సైబర్ కుట్ర
- కేసులు పెట్టినా ఆగని పాత ఫోన్ల దందా
- గల్లీల్లో డేటా చోరీ మాఫియా






### ఇలాంటి డేటా చోరీ మాఫియాపై “విజన్ ఆంధ్ర“ ఎక్స్‌క్లూసివ్ స్టోరీ

**హైదరాబాద్, ఆగస్టు 20:** పాత ఫోన్లు, పాడైపోయిన మొబైల్స్ ఉంటే ఇవ్వండి... మంచి ప్లాస్టిక్ డబ్బాలు, స్టీల్ గిన్నెలు పట్టుకెళ్లండి...“ నగరంలోని సంధ్య వేళల్లోనో,




పల్లెల్లో మధ్యాహ్నం వేళల్లోనో వినిపించే ఈ పిలుపు వెనుక ఎంతటి భారీ కుట్ర దాగుందో సామాన్యుడికి అర్థం కావడం లేదు. మూలన పడేసిన పాత డబ్బా ఫోన్‌కు ఒక అందమైన ప్లాస్టిక్ డబ్బా వస్తుందన్న చిన్న ఆశ... అమాయక ప్రజలను సైబర్ నేరగాళ్ల ఉచ్చులోకి నెడుతోంది. గల్లీ గల్లీ తిరుగుతూ సాగుతున్న ఈ బీహార్ ముఠాల దందా వెనుక అసలు కథ తెలిస్తే వెన్నులో వణుకు పుట్టక మానదు.

### పాత ఫోన్ల మాయాజాలం...

#### ఎలా జరుగుతోంది ఈ దందా?

వీధుల్లో తిరిగే వ్యక్తులు అమాయకంగా కనిపించవచ్చు. కానీ, వారి వెనుక నడిచే నెట్‌వర్క్ అంతర్జాతీయ సైబర్ మాఫియాను తలపిస్తుంది.
డేటా తవ్వకాలు పాడైపోయిన ఫోన్ల నుంచి మదర్‌బోర్డులు, చిప్‌లను ప్రత్యేక టెక్నాలజీతో రికవర్ చేస్తారు. ఫార్మాట్ చేశామని మనం అనుకున్నా, డిలీట్ అయిన ప్రైవేట్ ఫోటోలు, ఆధార్ వివరాలు, బ్యాంక్ లావాదేవీల స్క్రీన్‌షాట్లు బయటకు తీస్తారు.

#### ఐఎంఈఐ క్లోనింగ్

ఈ పాత ఫోన్ల ఐఎంఈఐ నంబర్లను అక్రమంగా క్లోన్ చేసి, సైబర్ క్రైమ్స్ కోసం ఉపయోగించే కొత్త హ్యాండ్‌సెట్లకు కేటాయిస్తారు. ఫేక్ అకౌంట్ల లింకింగ్ ఫోన్‌లలో ఉండిపోయిన పాత మెయిల్ ఐడీలు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా లోన్ యాప్స్, బెట్టింగ్ సైట్లు, ఫేక్ బ్యాంక్ ఖాతాలను ఆపరేట్ చేస్తారు. పోలీసులు ఎక్కడో జరిగే సైబర్ మోసాన్ని ట్రాక్ చేస్తే... ఆ సిగ్నల్ మన తెలంగాణలోని ఏదో ఒక పల్లెటూరి పాత ఫోన్ ఐపీ అడ్రస్‌ను చూపిస్తుంది. ఫలితంగా అసలు నేరగాళ్లు దర్జాగా తప్పించుకుంటుంటే, డబ్బా కోసం ఫోన్ ఇచ్చిన అమాయకులు పోలీసుల విచారణ ఎదుర్కోవాల్సి వస్తోంది.

#### కేసులు పెట్టినా... ఆగని పాత నెట్‌వర్క్

గతంలో తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు పలు జిల్లాల్లో ఈ ముఠాలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. భారీగా పాత ఫోన్లు, విడిభాగాలను స్వాధీనం చేసుకున్నారు. అయినా కూడా ఈ దందా ఆగకపోవడానికి కారణం... గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేకపోవడమే. ఒక ముఠా జైలుకు వెళ్తే, మరో కొత్త ముఠా ప్లాస్టిక్ సామాన్లతో వీధుల్లోకి దిగుతోంది.

### మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు!!

#### ఉచితాల ఉచ్చులో పడకండి

ప్లాస్టిక్ డబ్బాలు, నాసిరకం వస్తువుల కోసం మీ వ్యక్తిగత సమాచారం దాగి ఉండే డిజిటల్ పరికరాలను అపరిచితులకు ఇవ్వకండి.

#### సరైన ఈ-వేస్ట్ డిస్పోజల్

ఫోన్ పనికిరాకుండా పోతే అధీకృత ఈ–వేస్ట్ రీసైక్లింగ్ కేంద్రాలకు మాత్రమే అప్పగించండి.

#### పూర్తిగా ధ్వంసం చేయండి

ఫోన్ పూర్తిగా పాడైపోతే, అందులోని మెమరీ చిప్, మదర్‌బోర్డును పూర్తిగా విరిచి వేయడం లేదా కాల్చివేయడం ద్వారా డేటా చోరీని అరికట్టవచ్చు.

#### పోలీసులకు సమాచారం

మీ వీధుల్లో పాత ఫోన్లు సేకరిస్తూ అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వండి. డిజిటల్ యుగంలో మన డేటాయే మన ఆస్తి, మన భద్రత. చిన్న ప్లాస్టిక్ డబ్బా కోసం ఆ భద్రతను అపరిచితుల చేతుల్లో పెట్టకండి.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# ప్రాణం పోయాక పరిహారమా.. ముందే భద్రత ఎక్కడ..?

- ఉడిత్యాల రాయి పొడి పరిశ్రమలో కార్మికుడి మృతితో విషాదం
- ఉదయం పనికి వెళ్లిన కార్మికుడు.. తిరిగి రాని లోకాలకు
- అనుమతులు లేకుండానే నడుస్తున్న రాయి పరిశ్రమ
- కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం
- అధికారుల తనిఖీలు కాగితాలకే పరిమితమా
- పంచాయతీ కార్యదర్శి సంచలన వివరాలు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**జడ్చర్ల / బాలానగర్ / ఆగస్టు 20, (విజన్ ఆంధ్ర):** కుటుంబ పోషణ కోసం కష్టపడే ఓ కార్మికుడి ప్రాణం రాయి పొడి పరిశ్రమలో బలైంది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాలలోని ఎస్ఎన్ఆర్ రాయి పొడి పరిశ్రమలో స్థానికుల




వివరాల ప్రకారం.. విజయవాడ జిల్లా, మంగళ గిరి నియోజకవర్గానికి చెందిన సాయి కిరణ్ అనే కార్మికుడు ప్రమాదంలో మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. ఈ ఘటనతో పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు, అనుమతుల అంశంపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.

### ఉదయం పనికి వెళ్లిన కార్మికుడు.. తిరిగి రాని లోకాలకు

కుటుంబాన్ని పోషించేందుకు ఉదయాన్నే ఇంటి నుంచి వెళ్లిన సాయి కిరణ్ తిరిగి రాలేదు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడంతో భార్య, పిల్లలు అనాథలయ్యారు. ప్రాణం పోయిన తర్వాత ఇచ్చే పరిహారం ఏమూలకు సరిపోతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### అనుమతులు లేకుండానే నడుస్తున్న రాయి పరిశ్రమ

ఈ పరిశ్రమకు సంబంధిత అన్ని అనుమతులు ఉన్నాయా అనే అనుమానాలు ఉన్నాయి. ముఖ్యంగా హెచ్ఎండిఏ నుంచి ఫైనల్ టెక్నికల్ అప్రూవల్ రాకుండానే పరిశ్రమను నడుపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కాలుష్యం, అగ్నిమాపక, ఫ్యాక్టరీ లైసెన్స్ నిబంధనలు పాటిస్తున్నారా అని అధికారులు తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం

కార్మికులకు హెల్మెట్, సేఫ్టీ షూస్, మాస్కులు వంటి కనీస భద్రతా పరికరాలు కూడా ఇవ్వలేదని ఆరోపణలు ఉన్నాయి. రాయి కొట్టే, పొడి చేసే యంత్రాల వద్ద ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవని, కార్మికులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదని స్థానికులు చెబుతున్నారు.

### అధికారుల తనిఖీలు కాగితాలకే పరిమితమా

ప్రమాదాలు జరగకుండా ముందస్తు తనిఖీలు చేయాల్సిన కార్మిక, పరిశ్రమల శాఖ అధికారులు ప్రమాదం జరిగిన తర్వాతే వస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

### పంచాయతీ కార్యదర్శి సంచలన వివరాలు

ఈ అంశంపై వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి రవి ప్రకాష్ సంచలన విషయం చెప్పారు. ఎస్ఎన్ఆర్ రాయి పొడి పరిశ్రమకు ఇప్పటి వరకు హెచ్ఎండిఏ ఫైనల్ టెక్నికల్ అప్రూవల్ రాలేదని ఆయన వెల్లడించారు.

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

మృతుడి కుటుంబానికి చట్టపరంగా అందాల్సిన పరిహారం వెంటనే అందించాలని, నిర్లక్ష్యం రుజువైతే యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ జరిపించాలని కోరుతున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.